ఆదివారం
SUNDAY
15-11-2026

సంపుటి (Volume):2 || సంచిక: (Issue): 136

జగిత్యాల
JAGITIAL

పేజీలు: (PAGES):12
వెల (PRICE): 2.00

Circulated to Telangana
Published from Jagitial

PRGI REGD NO: TGTEL/25/A1385

www.evarthalu.com

నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక





డీజే సౌండ్‌కు 20 రోజుల పసికందు బలి

బల్లియా, నవంబర్ 14: డీజే శబ్దం ఓ నవజాత శిశువు ప్రాణం తీసిందనే విషాద ఘటన ఉత్తరప్రదేశ్‌లో చోటుచేసుకుంది. విగ్రహ నిమజ్జన ఊరేగింపులో భాగంగా భారీ డీజే సౌండ్ సిస్టమ్‌తో వెళ్తున్న వాహనం ఓ ఇంటి ముందు ఆగింది. ఆ సమయంలో తల్లి పక్కన నిద్రిస్తున్న 20 రోజుల పసికందు పెద్ద శబ్దానికి ఉలిక్కిపడి గట్టిగా ఏడ్చింది. కొద్దిసే పటికే కదలికలు లేకుండా పోవడంతో కుటుంబ సభ్యులు తరువాయి 2 వ పేజీలో...



పిండానికి ఓపెన్ స్పైనల్ సర్జరీ

న్యూఢిల్లీ, నవంబర్ 14: వైద్యరంగంలో ఎయిమ్స్ మరో అరుదైన ఘనత సాధించింది. తల్లి గర్భంలో ఉన్న 25 వారాల పిండానికి అత్యంత సంక్లిష్టమైన ఓపెన్ ఫీటల్ సర్జరీని విజయవంతంగా నిర్వహించింది. పిండం వెన్నెముకలో ఉన్న తీవ్రమైన లోపాన్ని సరిచేసేందుకు ఈ ఆపరేషన్ చేశారు. భారత్‌లో ఈ తరహా శస్త్రచికిత్స నిర్వహించడం ఇదే తొలిసారి. ఈ నెల 12న ఆపరేషన్ నిర్వహించినట్లు ఎయిమ్స్ శనివారం ప్రకటించింది. పిండానికి లంబోసేక్రల్ మైలోమెనింగోసీల్ అనే స్పైనా బైఫిడా సమస్య ఉన్నట్లు వైద్యులు తరువాయి 2 వ పేజీలో...



ఐఫోన్ కోసం తాతను చంపిన మనవరాలు

తిరువనంతపురం, నవంబర్ 14: ఐఫోన్, మోటార్‌సైకిల్ కొనుక్కోవడానికి డబ్బుల కోసం 13 ఏళ్ల బాలిక తన స్నేహితులతో కలిసి సొంత తాతనే హత్య చేసిన ఘటన కేరళలో కలకలం రేపింది. ఈ హత్యకు సంబంధించి పోలీసులు జువైనల్ జస్టిస్ బోర్డుకు 740 పేజీల ఛార్జ్‌షీట్ సమర్పించారు. ఇన్‌స్టాగ్రామ్‌లో రెండు నెలలపాటు చాటింగ్ చేసుకుంటూ హత్యకు ప్రణాళిక రూపొందించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. పోలీసుల వివరాల ప్రకారం.. కేరళలోని కరవట్టలో ఆగస్టు 15న ఈ ఘటన జరిగింది. 13 ఏళ్ల బాలికతో పాటు 16, 17 ఏళ్ల వయసున్న తరువాయి 2 వ పేజీలో...



పోరగాండ్లు.. పట్టేశారు!

ప్రతి ఓవర్ ఓ ఉత్కంఠ.. ప్రతి వికెట్ ఓ కుదుపు.. ప్రతి పరుగూ ఓ పోరాటం! చిరకాల ప్రత్యర్థులు భారత్-పాకిస్థాన్ మధ్య ఆసియా కప్ ఫైనల్ అంటేనే అభిమానుల్లో అంచనాలు ఆకాశాన్ని తాకాయి. అందుకు తగ్గట్టే మైదానంలో పరుగుల వరద పారింది. తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్.. ఉస్మాన్ ఖాన్ (107), అబ్దుల్ ఖాదిర్ (80), కెప్టెన్ ఫర్హాన్ యూసఫ్ (63) విధ్వంసక ఇన్నింగ్స్‌లతో భారత్ ముందు 338 పరుగుల కొండంత లక్ష్యాన్ని నిలిపింది. ఆ లక్ష్యం చూసి భారత శిబిరంలోనూ ఒత్తిడి కనిపించినా.. కుర్రాళ్లు వెనక్కి తగ్గలేదు.

ఓపెనర్ ఆర్యవీర్ సెహ్వాగ్ (58), కెప్టెన్ లక్ష్య రాయచందాని (80) అద్భుతంగా పోరాడుతూ విజయంపై ఆశలు రేపారు. కానీ కీలక సమయాల్లో వికెట్లు కుప్పకూలడంతో మ్యాచ్ పాకిస్థాన్ వైపు మొగ్గింది. ఒక దశలో 252 పరుగులకే 8 వికెట్లు కోల్పోయి ఓటమి అంచున నిలిచింది టీమిండియా. చేతిలో రెండు వికెట్లు.. గెలవాలంటే ఇంకా పరుగుల కొండ ఎక్కాలి! అయినా మణాల్ చౌహాన్ (47), మొహిత్ ఉల్వా (49 నాటౌట్) అసాధారణ పోరాటంతో మ్యాచ్ స్వరూపాన్నే మార్చేశారు. తొమ్మిదో వికెట్‌కు 57 పరుగులు జోడించి విజయంపై ఆశలు చిగురింపజేశారు. మణాల్ ఔటవడంతో మళ్లీ ఉత్కంఠ తారస్థాయికి చేరింది. చివరి ఓవర్‌లో విజయానికి కావాల్సిన పరుగుల కోసం ప్రతీ బంతి ఓ పరీక్షగా మారింది. ఒక్కో పరుగు వస్తుంటే భారత అభిమానుల్లో ఆశలు.. పాక్ శిబిరంలో తరువాయి 2 వ పేజీలో...



ఫాసిస్టు పాలన

పదేళ్లలో దేశంలో విద్వేష రాజకీయాలు.. 2014 నుంచే ప్రజాస్వామ్యం నిర్వీర్యం

గిగ్ వర్కర్లకు కాంగ్రెస్ అండగా ఉంటుంది.. ప్రతి డెలివరీపై 1% నిధులు: రాహుల్ గాంధీ

దేశంలో గత పదేళ్లలో ఫాసిస్టు పాలన నడుస్తోందని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. హైదరాబాద్ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి తెలంగాణ గిగ్ వర్కర్స్ పాలసీని ఆవిష్కరించిన సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడారు. గిగ్ వర్కర్ల శ్రమకు తగిన గుర్తింపు, ప్రతిఫలం దక్కేలా.. వారి హక్కులు, సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. ఇప్పటివరకు గిగ్ వర్కర్లకు సంబంధించిన సమగ్రసమాచారం అందుబాటులో లేదని, తాము చేస్తున్న పనికి ఎంత ప్రతిఫలం లభిస్తోందనే విషయంలోనూ స్పష్టత లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వారి సంక్షేమం కోసం గతంలో జరిగిన సమావేశంలో ఇచ్చిన హామీని ఇప్పుడు అమలు చేస్తున్నామని తెలిపారు.

హైదరాబాద్, నవంబర్ 14 (ఈవార్తలు): కేంద్రం లోని మోదీ ప్రభుత్వం, ఆర్ఎస్ఎస్ విధానాలు కంపెనీల ప్రయోజనాలకే పెద్దపీట వేస్తున్నాయని రాహుల్ గాంధీ విమర్శించారు. గిగ్ వర్కర్లను వెట్టిచాకిరీ చేసే కార్మికులు గా మార్చి, వారి శ్రమను దోచుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. కార్మికులను బానిసలుగా మార్చే ప్రయ త్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. గిగ్ వర్కర్లను కేవలం సేవలందించే వ్యక్తులుగా కాకుండా, దేశ అభివృద్ధిలో భాగస్వాములుగా తీర్చిది ద్దడమే తమ లక్ష్యమని తరువాయి 2 వ పేజీలో...

టీకాంగ్రెస్‌కు కొత్త ఇంచార్జి

బీఎం సందీప్‌కు పగ్గాలు

మీనాక్షి నటరాజన్ పదవీ విరమణ



న్యూఢిల్లీ/హైదరాబాద్, నవంబర్ 14 (ఈవార్తలు): తెలంగాణ కాంగ్రెస్‌కు కొత్త ఇంచార్జి వచ్చారు. తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్‌గా కర్ణాటక రాష్ట్రానికి చెందిన బీఎం సందీప్‌ను నియమించింది కాంగ్రెస్ అధిష్టానం. ఇప్పటి వరకు తెలంగాణ ఇన్‌ఛార్జ్‌గా కొనసాగిన మీనా క్షి నటరాజన సదవీ విరమణ చేస్తున్న నేపథ్యంలో ఆమె స్థానంలో బీఎం సందీప్ ను నియమిస్తూ అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తున్నట్టు ఏఐసీసీ జనరల్ సెక్రటరీ (ఆర్గనైజే షన్) ఎంపీ కేసీ వేణుగోపాల్ పేర్కొన్నారు. తెలంగాణ తరువాయి 2 వ పేజీలో...

బంగారం-వెండి ధరలు



బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

గ్రాము-24 క్యారెట్స్):	రూ.13,762
వెండి (కిలో):	రూ.1,95,000
ప్లాటినం (గ్రాము):	రూ.4,506

విశ్వవాణి



లైంగిక నేరాలకు పాల్పడి శిక్ష పడినవారు మళ్లీ అలాంటి నేరాలకు పాల్పడకుండా అడ్డుకునేందుకు ఇటలీ ప్రభుత్వం రసాయన కాస్ట్రేషన్ విధానాన్ని పరిశీలిస్తోంది. అత్యాచారాలు, బాలలపై లైంగిక దాడులకు పాల్పడిన నేరస్తులకు ఈ చికిత్సను అందించే అంశంపై అక్కడ చర్చ కొనసాగుతోంది. రసాయన కాస్ట్రేషన్ అమలుపై అధ్యయనం చేసేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనకు ఇటలీ దిగువ సభ ఆమోదం తెలిపింది. ఉప ప్రధాని మాటియో సాల్విని నేతృత్వంలోని లీగ్ పార్టీ ఈ ప్రతిపాదనకు మద్దతు ఇచ్చింది.

కవితకు రేవంత్ స్క్రిప్ట్

కవిత పార్టీ రేవంత్ కోసం పని చేస్తోంది..

టీఆర్ఎస్ అంటే 'తెలంగాణ రేవంత్ సైన్యం'

బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్పీ

మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్థాపించిన 'తెలంగాణ రక్షణ సేన' (టీఆర్ఎస్) పార్టీపై బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కవిత నేతృత్వంలోని ఈ పార్టీ ప్రజల కోసం కాదని, కాంగ్రెస్ పార్టీకి అనుబంధ విభాగంలా పనిచేస్తోందని ఆయన ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన స్క్రిప్ట్ ప్రకారమే కవిత బీఆర్ఎస్ నేతలపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.



హైదరాబాద్, నవంబర్ 14 (ఈవార్తలు): కవితను పార్టీ నుంచి బహిష్కరించడం ద్వారా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పార్టీని పెనుముప్పు నుంచి కాపాడారని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ వ్యాఖ్యానించారు. శనివారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియా సమా వేశంలో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సౌజన్యంతోనే 'తెలంగాణ రక్షణ సేన' పార్టీ ఏర్పాటైందని, అది కాంగ్రెస్‌కు అనుబంధ సంస్థగా పనిచేస్తోందని ఆరోపించారు. అధికార తరువాయి 2 వ పేజీలో...



అయ్యప్ప భక్తులకు రూ.2 లక్షల ఇన్సూరెన్స్

శబరిమల: నవంబర్ 17 నుంచి శబరిమల అయ్యప్ప ఆలయంలో మండల మకరువిళక్కు యాత్రా సీజన్ ప్రారం భం కానుంది. ఈ నేపథ్యంలో ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు తొలిసారిగా అయ్యప్ప భక్తుల కోసం ప్రత్యేక జీవిత బీమా పథకాన్ని ప్రవేశపెట్టింది. యాత్ర సమయంలో భక్తులు ఎవరైనా మరణిస్తే వారి కుటుంబాలకు రూ. 2 లక్షల పరిహారం అందజేయనున్నారు. శుక్రవారం జరిగిన బోర్డు సమావేశం అనంతరం ఈ పథకం గురించి టీడీబీ ఛైర్మన్ కే జయకుమార్ తరువాయి 2 వ పేజీలో...



స్పామ్ కాల్స్‌పై ట్రాయ్ కొరడా

న్యూఢిల్లీ: వినియోగదారులను వేధిస్తున్న స్పామ్ కాల్స్, నకిలీ మెసేజ్‌లపై టెలికాం నియంత్రణ సంస్థ 'ట్రాయ్' కఠిన చర్యలు తీసుకుంటోంది. జూలై-సెప్టెంబర్ నివేదిక ప్రకారం, నిబంధనలు ఉ ల్లంఘించిన 1.24 లక్షలకు పైగా మొబైల్ కనెక్షన్లపై కఠిన చర్యలు తీసుకుంది. ఇందులో మొదటిసారి నిబంధనలు మీరిన 1,10,325 నంబర్ల అవుట్‌గోయింగ్ సేవలను తరువాయి 2 వ పేజీలో...



త్వరలో ఎయిర్‌టెల్ ధరల పెంపు

ముంబై: మొబైల్ వినియోగదారుల జేబులకు త్వరలోనే మరోసారి చిల్లు పడనుంది. దేశంలో మొబైల్ టారిఫ్‌లు వినియోగదారుడికి నెలకు సగటున రూ. 350కి పెరగాల్సిన అవసరం ఉందని భారతీ ఎయిర్‌టెల్ చైర్మన్ సునీల్ భారతీ మిట్టల్ స్పష్టం చేశారు. భారతీ ఎంటర్‌ప్రైజెస్ 50వ వార్షికోత్సవం సందర్భంగా పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ, తరువాయి 2 వ పేజీలో...

చాట్ జీపీటీతోనే ఆన్‌లైన్ షాపింగ్!

చెల్లింపులు కూడా అదే చేస్తుంది.. కొనుగోళ్ల కోసం 'చాట్‌జీపీటీ వాలెట్'



న్యూయార్క్: టెక్నాలజీ దిగ్గజం ఓపెన్‌ఏఐ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో మరో సంచలనానికి తెరలేపింది. తమ ఏఐ ఏజెంట్లు యూజర్ల తరఫున నేరుగా ఆన్‌లైన్‌లో కొనుగోళ్లు జరిపేందుకు వీలుగా 'చాట్‌జీపీటీ వాలెట్' అనే కొత్త పేమెంట్ ఫీచర్‌ను నవంబర్ 13న అధికారికంగా ప్రకటించింది. వీసా, మాస్టర్‌కా ర్డ్, అమెరికన్ ఎక్స్‌ప్రెస్ వంటి దిగ్గజ పేమెంట్ నెట్‌వర్క్‌లతో కలిసి ఈ సేవలను అభివృద్ధి చేసింది. ఈ ఫీచర్‌తో యూజర్లు తమ ఏఐ అసిస్టెంట్లకు షాపింగ్ బాధ్యతలు అప్పగించ వచ్చు. ఈ వ్యవస్థ తరువాయి 2 వ పేజీలో...

తుది దశకు భారత్-అమెరికా ట్రేడ్ డీల్

దిగుమతి సుంకాల తగ్గింపునకు యూఎస్ ఓకే!



న్యూఢిల్లీ: భారత్-అమెరికా మధ్య ప్రతిపాదిత ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బీటీఏ) చర్చలు తుది దశకు చేరుకున్నాయి. ఈ ఒప్పందం కింద వియత్నాం, బంగ్లాదేశ్, కంబోడియా వంటి పోటీ దేశాలతో పోలిస్తే భారత ఎగుమతులపై తక్కువ దిగుమతి సుంకాలు కల్పిస్తామని అమెరికా హామీ ఇచ్చినట్లు సీనియర్ ప్రభుత్వ అధికారి ఒకరు వెల్లడించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరి నాటికి ఒప్పందంలోని మొదటి విడతను పూర్తి చేయాలని భారత్ లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో కస్టమ్స్, వాణిజ్యంపై తరువాయి 2 వ పేజీలో...



త్వరలో టాటా కార్ల ధరల పెంపు

రాశి ఫలాలు

15.11.2026

మేషం: ముఖ్యమైన వ్యవహారాలలో స్వంత ఆలోచనలు పనిచేయవు. స్వల్ప అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. సంతాన విషయంలో ఇతరులతో విభేదాలు కలుగుతాయి. విలువైన వస్తువుల విషయంలో జాగ్రత్త వహించాలి. వృత్తి వ్యాపారాలలో స్వల్ప లాభాలు అందుతాయి. ఉద్యోగస్తులకు అదనపు బాధ్యతలు తప్పవు.

వృషభం: ఆర్థిక పరిస్థితి గందరగోళంగా ఉంటుంది. తల్లిదండ్రులు ఆరోగ్య విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలి. అవసరానికి కుటుంబ సభ్యుల సహాయం లభించదు. వృత్తి వ్యాపారాలలో గందరగోళ పరిస్థితులుంటాయి. చేపట్టిన పనులలో అవరోధాలు కలుగుతాయి. నిరుద్యోగ ప్రయత్నాలు మందకొడిగా సాగుతాయి.

మిథునం: విలువైన వస్త్ర ఆభరణాలు కొనుగోలు చేస్తారు. ఇంటాబయట కీలక నిర్ణయాలను అమలు పరుస్తారు. ఆదాయ మార్గాలు విస్తృతమౌతాయి. వృత్తి ఉద్యోగాలలో శ్రమకు తగిన గుర్తింపు లభిస్తుంది. వ్యాపారపరంగా స్థిరమైన లాభాలు అందుకుంటారు. దీర్ఘకాలిక ఋణాల నుండి ఊరట పొందుతారు.

కర్కాటకం: ఆర్థిక ఇబ్బందుల వలన నూతన ఋణ ప్రయత్నాలు చేస్తారు. అకారణంగా ఇతరులతో మాటపట్టింపులు కలుగుతాయి. చేపట్టిన పనులలో శ్రమ తప్ప ఫలితం కనిపించదు. నేత్ర సంబంధిత అనారోగ్య సమస్యలు భాదిస్తాయి. కుటుంబ వాతావరణం చికాకు కలిగిస్తుంది. వృత్తి, ఉద్యోగాలు నిదానంగా సాగుతాయి.

సింహం: గృహమున శుభకార్యములు నిర్వహిస్తారు. వృత్తి ఉద్యోగాలలో ఆశించిన మార్పులుంటాయి. కుటుంబ సభ్యులతో విందువినోద కార్యక్రమాలలో పాల్గొంటారు. స్థిరాస్తి కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. ఆదాయం పెరుగుతుంది. నూతన వ్యాపారాలు ప్రారంభిస్తారు. ఆర్థిక పురోగతి కలుగుతుంది.

కన్య: వృధా ఖర్చుల విషయంలో ఆలోచించి ముందుకు సాగడం మంచిది. ఇతరుల వ్యవహారాలలో జోక్యం చేసుకోవడం మంచిది కాదు. వృధా ప్రయాణాలు చేయవలసి వస్తుంది. సమయానికి నిద్రాహారాలు ఉండవు. వ్యాపార పరంగా స్వల్ప ధన నష్ట సూచనలు ఉన్నవి. వృత్తి ఉద్యోగాలలో అధికారుల కోపానికి గురి కావల్సి వస్తుంది.

తుల: నిరుద్యోగ ప్రయత్నాలు వేగవంతం చేస్తారు. గృహ నిర్మాణ విషయంలో కీలక నిర్ణయాలు తీసుకుంటారు. ఇంటాబయట గౌరవమర్యాదలు పెరుగుతాయి. అవసరానికి ఆప్తుల నుండి ధన సహాయం అందుతుంది. వ్యాపారాలు సజావుగా సాగుతాయి. వృత్తి ఉద్యోగమున అనుకూల వాతావరణం ఉంటుంది.

వృశ్చికం: ఉద్యోగమున అధికారుల ఆదరణ పెరుగుతుంది. బంధు మిత్రుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. వ్యాపారాలలో కుటుంబ పెద్దల ఆలోచనలు కలసివస్తాయి. నిరుద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. కుటుంబ సభ్యులతో దైవ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఆర్థికంగా కొంత మెరుగైన పరిస్థితులుంటాయి.

ధనస్సు: ఆదాయానికి మించి ఖర్చులు పెరుగుతాయి. నూతన ఋణ ప్రయత్నాలు చేయవలసి వస్తుంది. కుటుంబ సభ్యుల మాటలు కొంత మానసికంగా కలచివేస్తాయి. వ్యాపార ఉద్యోగాలలో మరింత గందరగోళ పరిస్థితులు ఉంటాయి. ఇంటాబయటా బాధ్యతలు పెరుగుతాయి. మానసిక ఆరోగ్య సమస్యలు ఇబ్బంది కలిగిస్తాయి.

మకరం: వాహన ప్రయాణాలలో జాగ్రత్త అవసరం. చేపట్టిన పనులు మధ్యలో విరమిస్తారు. వ్యాపారపరంగా ఇతరులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. కుటుంబ సభ్యులతో స్థిరాస్తి వివాదాలు కలుగుతాయి. వృత్తి ఉద్యోగాలలో చేయని పనికి నిందలు పడవలసి వస్తుంది. నిరుద్యోగులకు నిరాశ తప్పదు.

కుంభం: కీలక సమయంలో జీవితభాగస్వామి సలహాలు తీసుకోవడం మంచిది. పెద్దల ఆరోగ్య విషయంలో శుభవార్తలు అందుతాయి. శత్రువులు కూడా మిత్రులుగా మారి సహాయం అందిస్తారు. నూతన గృహ వాహనయోగం ఉన్నది. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. వృత్తి ఉద్యోగాలలో సమస్యల నుండి తెలివిగా బయటపడతారు.

మీనం: చేపట్టిన పనులలో అప్రయత్న కార్యసిద్ధి కలుగుతుంది. భాగస్వామ్య వ్యాపారాలలో మీ అంచనాలు నిజమవుతాయి. దూరపు బంధువుల నుండి అందిన సమాచారం కొంత ఆనందం కలిగిస్తుంది. స్థిరాస్తి క్రయ విక్రయాలు అనుకూలంగా సాగుతాయి. వృత్తి ఉద్యోగాలలో నూతన ప్రోత్సాహకాలు అందుకుంటారు.

ఫాసిస్టు పాలన



మొదటి పేజీ తరువాయి

పేర్కొన్నారు. వారి హక్కులతోపాటు కుటుంబాల విద్య, వైద్యం, సంక్షేమానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. గిగ్ వర్కర్లకు రక్షణ కల్పించడమే కొత్త పాలసీ ప్రధాన ఉద్దేశమని రాహుల్ గాంధీ వివరించారు. ఈ విధానం ద్వారా వారి పని, డెలివరీలు, శ్రమకు లభించే ప్రతిఫలానికి సంబంధించిన వివరాలను నేరుగా మొబైల్ ఫోన్లలో తెలుసుకునే అవకాశం కల్పిస్తామని చెప్పారు. ఇప్పటివరకు సరైన సమాచారం లేకపోవడంతో ఎదురవుతున్న సమస్యలకు ఈ వ్యవస్థ పరిష్కారం చూపుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రతి డెలివరీపై ఒక శాతం మొత్తాన్ని గిగ్ వర్కర్ల సంక్షేమ నిధికి కేటాయించి, బోర్డు ద్వారా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసేలా ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు.

డెలివరీలు, ఇతర పనుల సమయంలో ప్రమాదాలు జరిగినా, తీవ్రమైన అనారోగ్య సమస్యలు ఎదురైనా గిగ్ వర్కర్లు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. అలాంటి పరిస్థితుల్లో వారికి భరోసా కల్పించేందుకు కొత్త చట్టం ద్వారా రూ.5 లక్షల ప్రమాద బీమా సదుపాయాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. పింఛన్, సామాజిక భద్రత, పొదుపు వంటి అంశాలపైనా ప్రత్యేక దృష్టి పెట్టినట్లు వెల్లడించారు. ఈ చర్యలు కార్మికులకు దీర్ఘకాలిక ఆర్థిక భద్రత కల్పించడంలో కీలకమవుతాయని అభిప్రాయపడ్డారు. మరోవైపు, పని మధ్యలో విశ్రాంతి తీసుకునేందుకు గిగ్ వర్కర్లకు ప్రత్యేక సదుపాయాలు కల్పించనున్నట్లు రాహుల్ గాంధీ ప్రకటించారు. వైపై సౌకర్యంతో కూడిన విశ్రాంతి భవనాలను అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. కార్మికుల పని పరిస్థితులు మెరుగుపడటంతోపాటు వారి కుటుంబాల భవిష్యత్తుకు భద్రత కల్పించడమే ఈ విధానం వెనుక ఉన్న ప్రధాన ఆలోచనగా వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి.. గిగ్ వర్కర్ల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. కార్మికులకు మెరుగైన భద్రత, ఆరోగ్య సదుపాయాలు, ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా ఈ చట్టాన్ని తీసుకొచ్చినట్లు తెలిపారు. ఈ చట్టం ద్వారా గిగ్ వర్కర్లకు ప్రభుత్వం పలు కీలక ప్రయోజనాలు కల్పిస్తోందని సీఎం వివరించారు. విధి నిర్వహణలో ప్రమాదాలు ఎదురైనప్పుడు ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రమాద బీమా సౌకర్యం అందిస్తున్నట్లు తెలిపారు. వైద్య ఖర్చుల భారం తగ్గించేందుకు ఆరోగ్యశ్రీ పథకం కింద చికిత్స పరిమితిని రూ.10 లక్షలకు పెంచినట్లు వెల్లడించారు. అంతేకాకుండా గిగ్ వర్కర్ల సమస్యలను పరిష్కరించడం, వారి సంక్షేమ కార్యక్రమాలను పర్యవేక్షించడం కోసం ప్రత్యేకంగా గిగ్ వర్కర్స్ బోర్డును ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

టీకాంగ్రెస్‌కు కొత్త ఇంచార్జి

మొదటి పేజీ తరువాయి

కాంగ్రెస్ ఇంచార్జిగా బీఎం సందీప్ నియామకాన్ని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆమోదించారని, ఆయన్ను తెలంగాణ ఏఐసీసీ ఇంచార్జిగా తక్షణమే అమల్లోకి వచ్చేలా నియమించాలని ఆదేశించినట్టు ఉత్తర్వుల్లో కేసీ వేణుగోపాల్ పేర్కొన్నారు. అలాగే ఇన్నాళ్ల పాటు తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ వ్యవహారాలను పర్యవేక్షించిన మీనాక్షి నటరాజన్‌కు పార్టీ అభినందనలు తెలిపింది. బీఎం సందీప్ కుమార్ కర్ణాటకలోని చిక్కమగళూరు ప్రాంతానికి చెందిన వ్యక్తి. ఇండియన్ యూత్ కాంగ్రెస్ ద్వారా రాజకీయాల్లోకి వచ్చిన సందీప్ అంచెలంచెలుగా ఎదిగారు. గతంలో సందీప్ రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ జాతీయ కన్వీనర్‌గా, కర్ణాటక రాష్ట్ర కన్వీనర్‌గా కూడా పనిచేశారు. ఏఐసీసీ కార్యదర్శిగా వ్యవహరిస్తూ గతంలో గుజరాత్, మహారాష్ట్ర రాష్ట్రాలకు కో-ఇంచార్జిగా, అలాగే కేరళ రాష్ట్రానికి అదనపు ఏఐసీసీ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించారు. ఇప్పుడు తాజాగా తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జిగా నియామకం అయ్యారు.





కవితకు రేవంత్ స్క్రిప్ట్

మొదటి పేజీ తరువాయి

పక్షం వైఫల్యాలను ప్రశ్నించాల్సిన కవిత, నిత్యం కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులను లక్ష్యంగా చేసుకుని విమర్శించడం వెనుక రేవంత్ రెడ్డి హస్తం ఉందన్నారు. కవిత రాజకీయాలకు ఏమాత్రం పనికిరారని, తక్షణమే రాజకీయ సన్యాసం తీసుకోవాలని ప్రవీణ్ కుమార్ హితవు పలికారు. 2010-12 మధ్య కాలంలో రేవంత్ రెడ్డి, కవిత, సృజన్ రెడ్డి కలిసి ఒకే చిరునామాతో 30 కంపెనీలకు డైరెక్టర్లుగా వ్యవహరించారని, వెయ్యి కోట్ల కాలువ పనులను సృజన్ రెడ్డికి ఇప్పించడంలో కవిత కీలక పాత్ర పోషించారని సంచలన ఆరోపణలు చేశారు.

విజిలెన్స్ నివేదికలు కవితకు ఎలా చేరాయి?

మల్లన్నసాగర్ ప్రాజెక్టుకు కేంద్ర జలసంఘం, జీఎస్ఐ అనుమతులు ఉన్నాయని, కొండపోచమ్మ సాగర్ నుంచి కేసీఆర్ భూములకు నీరు వెళ్తే తప్పేంటని ప్రవీణ్ కుమార్ ప్రశ్నించారు. నిమ్స్‌లో హరీశ్ రావు రూ. 200 కోట్ల కుంభకోణం చేశారన్న ఆరోపణలను ఆయన ఖండించారు. ఉద్యోగులకు ఈహెచ్ఎస్ ప్రయోజనాలు కల్పించడం నేరమా అని నిలదీశారు. ప్రభుత్వ విజిలెన్స్ విభాగం వద్ద రహస్యంగా ఉండాల్సిన నివేదికలు కవిత చేతికి ఎలా వెళ్లాయని ప్రశ్నిస్తూ, ఇది అధికారిక రహస్యాల చట్టం ఉల్లంఘన కిందకు వస్తుందన్నారు. ఈ నెల 19న సిద్దిపేటలో సీఎం మాట్లాడబోయే అంశాలనే కవిత ముందుగా మాట్లాడుతున్నారని, ఆమెకు కనీస అవగాహన లేదని ఎద్దేవా చేశారు. కవిత రాజకీయాలకు ఏమాత్రం పనికిరారని, తక్షణమే రాజకీయ సన్యాసం తీసుకోవాలని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ హితవు పలికారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఏం జరుగుతుందో సిట్ అధికారుల కంటే ముందే ముఖ్యమంత్రికి ఎలా తెలుస్తోందని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతలపై ఇలాగే నిరాధార ఆరోపణలు చేస్తే కవితపై న్యాయపరంగా ముందుకు వెళ్లాలని పార్టీ నిర్ణయించిందని, త్వరలోనే మరిన్ని ఆధారాలను ప్రజల ముందు బయటపెడతామని స్పష్టం చేశారు.

చాట్ జీపీటీతోనే ఆన్‌లైన్ షాపింగ్!

మొదటి పేజీ తరువాయి

పూర్తి భద్రతకు పెద్దపీట వేస్తూ పనిచేస్తుంది. ముందుగా యూజర్లు తమ పేమెంట్ కార్డు వివరాలను ఒకసారి చాట్‌జీపీటీ వాలెట్‌లో యాడ్ చేయాలి. ఆ తర్వాత 'దాట్స్' అని పిలిచే ఏఐ ఏజెంట్లు యూజర్ ఆదేశాల మేరకు ఆన్‌లైన్‌లో వస్తువులను కొనుగోలు చేసేందుకు సిద్ధం చేస్తాయి. చెల్లింపు దశకు వచ్చినప్పుడు, యూజర్‌కు ఒక నోటిఫికేషన్ వస్తుంది. అందులో కొనుగోలు చేస్తున్న వస్తువులు, మొత్తం ధర, ఉపయోగించబోయే కార్డు వివరాలు ఉంటాయి. యూజర్ వీటన్నిటినీ సమీక్షించి, ఫేస్ ఐడీ లేదా వేలిముద్ర వంటి బయోమెట్రిక్ భద్రతా పద్ధతి ద్వారా లావాదేవీని ఆమోదించాల్సి ఉంటుంది. ఆమోదం పొందిన వెంటనే, పేమెంట్ నెట్‌వర్క్ అసలు కార్డు వివరాలకు బదులుగా ఒక తాత్కాలిక డిజిటల్ టోకెన్‌ను సృష్టిస్తుంది. ఈ టోకెన్ ద్వారా మాత్రమే చెల్లింపు జరుగుతుంది. దీనివల్ల అసలు కార్డు వివరాలు ఏఐ ఏజెంట్‌కు గానీ, వ్యాపారికి గానీ చేరవు. తద్వారా ఆర్థిక లావాదేవీలకు పూర్తి భద్రత లభిస్తుంది. ప్రస్తుతానికి ఈ సేవలు అమెరికాలోని 18 ఏళ్లు పైబడిన చాట్‌జీపీటీ ప్రో సబ్‌స్క్రైబర్లకు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. వారు తమ కార్డులను దీనికి అనుసంధానం చేసుకోవచ్చు. ఈ వాలెట్ ద్వారా జరిపే కొనుగోళ్లకు కూడా సాధారణ కార్డు లావాదేవీల మాదిరిగానే రివార్డ్ పాయింట్లు, నాణ్యత లేని వస్తువుల విషయంలో వివాదాల పరిష్కారం వంటి రక్షణలు వర్తిస్తాయని ఓపెన్ఏఐ స్పష్టం చేసింది. మోసాలను నివారించేందుకు ప్రత్యేక సంస్థలతో కలిసి పనిచేస్తున్నామని, ఏజెంట్ల ద్వారా జరిగే కొనుగోళ్లను సులభంగా ప్రాసెస్ చేసేలా వ్యాపారులకు మార్గదర్శకాలు అందిస్తున్నామని తెలిపింది. భవిష్యత్తులో నిర్దిష్ట ఖర్చు పరిమితులు, వస్తువుల కేటగిరీలు లేదా నిర్ణీత కాల వ్యవధిలో స్వయంచాలకంగా కొనుగోళ్లు జరిపేందుకు ఏజెంట్లకు అనుమతులు ఇచ్చే దిశగా పనిచేస్తున్నామని, అయితే దీనికి మరిన్ని భద్రతా ప్రమాణాలు అవసరమని కంపెనీ వివరించింది. ప్రస్తుత పరిమిత విడుదల ద్వారా ఫీడ్‌బ్యాక్ సేకరించి, వ్యవస్థను మరింత మెరుగుపరిచి భవిష్యత్తులో ప్రపంచవ్యాప్తంగా విస్తరించాలని ఓపెన్ఏఐ లక్ష్యంగా పెట్టుకుంది.

డీజే సౌండ్‌కు 20 రోజుల పసికందు బలి

మొదటి పేజీ తరువాయి

ఆసుపత్రికి తరలించారు. అప్పటికే శిశువు మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. ఉత్తరప్రదేశ్‌లోని బల్లియా జిల్లాలో ఈ ఘటన జరిగింది. రీమా దేవి 20 రోజుల క్రితం ఆడబిడ్డకు జన్మనిచ్చింది. కాన్పు తర్వాత ముడియారి గ్రామంలోని పుట్టింటికి వచ్చిన ఆమె.. పది రోజులుగా అక్కడే ఉంటోంది. ఈ క్రమంలో గ్రామంలో దేవతా విగ్రహ నిమజ్జన ఊరేగింపు నిర్వహించారు. డీజే సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేసిన వాహనం రీమా ఉంటున్న ఇంటి ముందు ఆగింది. భారీ శబ్దానికి తల్లి పక్కనే నిద్రిస్తున్న శిశువు ఉలిక్కిపడి గట్టిగా ఏడ్చింది. ఆ తర్వాత కదలకుండా ఉండటంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లగా శిశువు అప్పటికే చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. డీజే శబ్దం తగ్గించాలని, ఇంట్లో నవజాత శిశువు ఉందని, వాహనాన్ని అక్కడి నుంచి తరలించాలని పలుమార్లు కోరినా నిర్వాహకులు పట్టించుకోలేదని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి డీజే వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. శిశువు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పంపించారు. పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాతే మృతికి అసలు కారణం వెల్లడవుతుందని పోలీసు అధికారి తెలిపారు. నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

.. తాతను చంపిన మనవరాలు

మొదటి పేజీ తరువాయి

ముగ్గురు బాలురు ఈ హత్యలో పాల్గొన్నారు. బాలిక తాత (67) అద్దె ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో ముగ్గురు బాలురు అక్కడికి చేరుకున్నారు. ఇంటి బాత్రూం పైకప్పు పెంకులు తొలగించి, వెంటిలేషన్ మార్గం ద్వారా లోపలికి ప్రవేశించారు. అనంతరం వృద్ధుడి నోట్లో గుడ్డలు కుక్కి, ముఖంపై దుప్పటి కప్పి, కాళ్లు చేతులు కట్టేశారు. తీవ్రంగా కొట్టడంతో ఊపిరాడక ఆయన మరణించారు. ఆ తర్వాత ఇంట్లో ఉన్న సుమారు నాలుగున్నర తులాల బంగారాన్ని దొంగిలించారు. ఈ హత్యను నిందితులు వాట్సాప్ వీడియో కాల్ ద్వారా బాలికకు ప్రత్యక్షంగా చూపించినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఆగస్టు 17న ఘటన వెలుగులోకి రావడంతో పోలీసులు అదే రోజు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి ఫోన్లలోని ఇన్‌స్టాగ్రామ్ చాట్స్‌ను స్వాధీనం చేసుకుని మెటా సంస్థ ద్వారా ధ్రువీకరించారు. ఆరు సిమ్ కార్డులను కూడా స్వాధీనం చేసుకున్నారు.

తుది దశకు భారత్-అమెరికా ట్రేడ్ డీల్

మొదటి పేజీ తరువాయి

చర్చించేందుకు అమెరికా ప్రతినిధి బృందం ఇటీవలే భారత్‌లో పర్యటించింది. సేవల రంగానికి సంబంధించిన అంశాలను రెండవ దశలో పరిష్కరించనున్నారు. అమెరికాతో భారత్ అత్యుత్తమ వాణిజ్య ఒప్పందాల్లో ఒకటి సాధిస్తుందని, తద్వారా కీలక ఉత్పత్తులకు యూఎస్ మార్కెట్‌లో అత్యంత ప్రాధాన్యత లభిస్తుందని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ ధీమా వ్యక్తం చేశారు. అమెరికా మధ్యంతర ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ ఓటమి పాలై, కాంగ్రెస్‌పై డెమొక్రాట్లు పట్టు సాధించినప్పటికీ, ఆ దేశ అంతర్గత రాజకీయాలతో వాణిజ్య ఒప్పందాలను ముడిపెట్టబోమని ఆయన స్పష్టం చేశారు. మరోవైపు, భారత్‌తో వాణిజ్య ఒప్పందాల కోసం గ్వాటెమాల, ఈక్వెడార్ దేశాలు కూడా ఆసక్తి చూపుతున్నాయని, యూరోపియన్ యూనియన్ ఒప్పందం అమలుకు కొంత సమయం పడుతుందని గోయల్ పేర్కొన్నారు.

త్వరలో టాటా కార్ల ధరల పెంపు

ముంబై: ముడిసరుకుల ధరలు విపరీతంగా పెరుగుతుండటంతో కార్ల కొనుగోలుదారులకు షాకిచ్చేందుకు టాటా మోటార్స్ సిద్ధమవుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నాల్గవ త్రైమాసికంలో ప్యాసింజర్ వాహనాల ధరలను మరింత పెంచే ఆలోచనలో ఉన్నట్లు కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ శైలేష్ చంద్ర వెల్లడించారు. ముఖ్యంగా ఉక్కు, రబ్బరు, రాగి ధరలు పెరగడంతో కంపెనీ లాభాలపై తీవ్ర ఒత్తిడి పడుతోంది. వ్యయ నియంత్రణ చర్యలు చేపట్టినప్పటికీ, పెరిగిన ముడిసరుకుల ఖర్చుల్లో 60 శాతం భారాన్ని సంస్థే భరిస్తోందని సీఎఫ్ఓ ధీమన్ గుప్తా తెలిపారు. దీనివల్ల దేశీయ ప్యాసింజర్ వాహనాల మార్జిన్ 180 బేసిస్ పాయింట్లు తగ్గి 4 శాతానికి పరిమితమైంది. అయితే, కొన్ని లోహాల ధరలు తగ్గే అవకాశం ఉన్నందున, మొత్తం భారాన్ని ఒకేసారి కస్టమర్లపై మోపకుండా అంచనా వేసి ధరలను సవరించనున్నట్లు సంస్థ స్పష్టం చేసింది.

స్పామ్ కాల్స్‌పై ట్రాయ్ కొరడా

మొదటి పేజీ తరువాయి

15 రోజుల పాటు నిలిపివేయగా, పదేపదే తప్పు చేసిన 13,777 కనెక్షన్లను ఏడాది పాటు డిస్‌కనెక్ట్ చేసింది. అంతేకాకుండా, 3,725 ఎస్సెమ్మెస్‌లను బ్లాక్ చేయడంతో పాటు 374 సంస్థలను ఏడాది పాటు కొత్త కనెక్షన్లు తీసుకోకుండా బ్లాక్‌లిస్ట్‌లో పెట్టింది. ఈ మూడు నెలల్లో ట్రాయ్‌కు 15.29 లక్షల ఫిర్యాదులు అందగా, అందులో 92.9 శాతం ఫిర్యాదులు 'ట్రాయ్ డీఎన్‌డీ' యాప్ ద్వారానే నమోదయ్యాయి. టెలికాం ఆపరేటర్లు ఏర్పాటు చేసిన ఏఐ వ్యవస్థలు ఏకంగా 19.9 బిలియన్ల అనుమానిత స్పామ్ కాల్స్, మెసేజ్‌లను గుర్తించి అడ్డుకోగా, ఈ-కేవైసి వెరిఫికేషన్‌లో విఫలమైన మరో 9,977 కనెక్షన్లను నిలిపివేశారు.

పిండానికి ఓపెన్ స్పైనల్ సర్జరీ

మొదటి పేజీ తరువాయి

గుర్తించారు. ఈ లోపం కారణంగా వెన్నుపాము, నాడీ వ్యవస్థకు మరింత నష్టం జరిగే ప్రమాదం ఉంటుంది. దీన్ని గర్భంలోనే సరిచేయాలనే లక్ష్యంతో వైద్యుల బృందం సుమారు ఆరు గంటలపాటు శస్త్రచికిత్స నిర్వహించింది. ఈ ఆపరేషన్ కోసం వైద్యులు ఐదు వారాలపాటు ప్రత్యేకంగా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఫీటల్ ఇమేజింగ్ పరీక్షలు, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్, అనస్థీషియా ఏర్పాట్లు, ఆపరేషన్ సిమ్యులేషన్లు నిర్వహించారు. శస్త్రచికిత్సలో 30 మందికి పైగా వైద్యులు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు. గైనకాలజీ, మెటర్నల్-ఫీటల్ మెడిసిన్, న్యూరోసర్జరీ, అనస్థీషియా, రేడియో డయాగ్నసిస్, ప్లాస్టిక్ సర్జరీ, నియోనాటాలజీ విభాగాల నిపుణులు ఇందులో భాగమయ్యారు. న్యూరోసర్జరీ విభాగానికి డాక్టర్ దీపక్ గుప్తా, మెటర్నల్-ఫీటల్ బృందానికి డాక్టర్ నీనా మల్హోత్రా, డాక్టర్ కే అపర్ణ శర్మ నేతృత్వం వహించారు. ఈ విధానంలో తల్లి పొత్తికడుపు, గర్భాశయాన్ని శస్త్రచికిత్స ద్వారా తెరిచి పిండానికి చికిత్స చేస్తారు. అనంతరం గర్భాశయాన్ని తిరిగి కుడతారు. సాధారణంగా స్పైనా బైఫిడా సమస్యకు శిశువు పుట్టిన తర్వాతే ఆపరేషన్ చేస్తారు. అయితే గర్భంలోనే చికిత్స చేయడం వల్ల వెన్నుపాము నాడులపై మరింత నష్టం జరగకుండా అడ్డుకోవచ్చని వైద్యులు చెబుతున్నారు.

అయ్యప్ప భక్తులకు రూ.2 లక్షల ఇన్సూరెన్స్

మొదటి పేజీ తరువాయి

ప్రకటించారు. లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా భాగస్వామ్యంతో దీనిని ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. "శబరిమల యాత్రికుల కోసం జీవిత బీమా ప్రవేశపెట్టడం ఇదే తొలిసారి. గతంలో భక్తులకు ప్రమాద బీమా సౌకర్యం మాత్రమే ఉండేది. ఇది ఒక చారిత్రాత్మక నిర్ణయం, మా బోర్డు సాధించిన గొప్ప విజయంగా నేను భావిస్తున్నాను" అని ఆయన పేర్కొన్నారు. ఈ బీమాకు సంబంధించిన ప్రీమియం మొత్తాన్ని టీడీబీ తన సంక్షేమ నిధి నుంచి పూర్తిగా భరిస్తుంది. ఈ యాత్రా సీజన్‌లో ప్రీమియం కోసం బోర్డు దాదాపు రూ. 1 కోటి వరకు వెచ్చించనుందని ఆయన తెలిపారు. వర్చువల్ క్యూ బుకింగ్ చేసుకునే సమయంలోనే నామినీ పేరు, యాత్రికుడితో ఉన్న బంధుత్వం సమాచారం సేకరిస్తామని జయకుమార్ వెల్లడించారు.

త్వరలో ఎయిర్‌టెల్ ధరల పెంపు

మొదటి పేజీ తరువాయి

పదేళ్ల క్రితం తాను చెప్పిన రూ. 300 స్థాయి ఇప్పుడు ఏమాత్రం సరిపోదని, పెరుగుతున్న ద్రవ్యోల్బణం, విద్యుత్, ఇంధన ఖర్చులు, ఉద్యోగుల వేతనాల దృష్ట్యా ఛార్జీల పెంపు అనివార్యమని పేర్కొన్నారు. చైనాలో 10 లక్షలకు పైగా టెలికాం టవర్లు ఉండగా భారత్‌లో కేవలం 3.5 లక్షలు మాత్రమే ఉన్నాయని, దేశ డిజిటల్ వ్యవస్థను బలోపేతం చేసేందుకు టవర్ల సంఖ్యను రెట్టింపు చేయడంతో పాటు ఫైబర్ లైన్లు, 5జీ మౌలిక సదుపాయాలపై పెట్టిన లక్షల కోట్ల పెట్టుబడులను తిరిగి రాబట్టుకోవడానికి టారిఫ్ సవరణ తప్పనిసరని ఆయన అభిప్రాయపడ్డారు.

పోరగాండ్లు.. పట్టేశారు!

మొదటి పేజీ తరువాయి

ఆందోళన! చివరి బంతికి నాలుగు పరుగులు కొడితేనే విజయం సాధ్యమన్న తరుణంలో మొహిత్ ఉల్వా ఏమాత్రం తడబడలేదు. అహ్మద్ హుస్సేన్ వేసిన ఆఖరి బంతిని బౌండరీకి తరలించి భారత్‌కు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. అంతే.. ఒక్కసారిగా భారత శిబిరంలో సంబరాలు అంబరాన్నంటాయి. 50 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 339 పరుగులు చేసిన భారత్ ఒక్క వికెట్ తేడాతో పాకిస్తాన్‌ను మట్టికరిపించి అండర్-19 ఆసియా కప్‌ను కైవసం చేసుకుంది.

అమరావతికి 160 కి.మీ. వేగంతో రైళ్లు

ఎర్రుపాలెం–నంబూరు మధ్య 58.1 కి.మీ. కొత్త లైన్.. తాడికొండ వద్ద ప్రధాన స్టేషన్

అమరావతి, నవంబర్ 14 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి రైల్వే కనెక్టివిటీ కల్పించే ప్రాజెక్టులో కీలక ముందడుగు పడింది. అమరావతి మీదుగా వెళ్లే కొత్త రైల్వే లైన్ మార్గం, ప్రధాన స్టేషన్, భారీ టెర్మినల్ ఏర్పాటుకు సంబంధించిన ప్రణాళికలను రైల్వే శాఖ దాదాపు ఖరారు చేసింది. గతంలో రూపొందించిన ప్రతిపాదనల్లో కొన్ని మార్పులు చేస్తూ తాజా రూపురేఖలను సిద్ధం చేసింది. ఎర్రుపాలెం నుంచి నంబూరు వరకు 58.1 కిలోమీటర్ల మేర కొత్త రైల్వే లైన్ నిర్మించనున్నారు. గతంలో ఈ మార్గాన్ని 56.53 కిలోమీటర్లుగా ప్రతిపాదించారు. కొత్త మార్గంలో గంటకు 160 కిలోమీటర్ల వేగంతో రైళ్లు ప్రయాణించేలా ట్రాక్ నిర్మించనున్నారు. కృష్ణా నదిపై సుమారు 4.5 కిలోమీటర్ల పొడవైన భారీ వంతెన నిర్మించనున్నారు. వీటితో పాటు 32 పెద్ద వంతెనలు, 92 చిన్న వంతెనలు, 12 రోడ్ ఓవర్ బ్రిడ్జిలు లేదా అండర్ బ్రిడ్జిలు ఏర్పాటు చేయనున్నారు. తాడికొండకు సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలో రాజధాని ప్రధాన రైల్వే స్టేషన్‌ను నిర్మించనున్నారు. సుదూర ప్రాంతాల రైళ్ల నిర్వహణ కోసం కొప్పరవూరు వద్ద సుమారు 230 ఎకరాల్లో భారీ టెర్మినల్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. 24 ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతో కూడిన రైళ్లను నిర్వహించేలా దీనిని అభివృద్ధి చేయనున్నారు. టెర్మినల్‌లో తొమ్మిది ప్రధాన ప్లాట్‌ఫామ్‌లు, ఆరు సైడ్ లైన్లు, పిట్ లైన్లు, మరో 12 స్టేబ్లింగ్ లైన్లు ఏర్పాటు చేయాలని ప్రణాళిక రూపొందించారు. ఈ నిర్మాణాలకు అవసరమైన భూమిని కేటాయించాలని ఏపీ సీఆర్‌డీఏను రైల్వే శాఖ కోరింది.



మీరిచ్చే ప్రతి పైసా..
ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజానమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811
నంబర్‌ను సంప్రదించవచ్చు.

కోస్తాంధ్రకు తుపాను ముప్పు

18, 19 తేదీల్లో భారీ వర్షాలు

విశాఖపట్నం, నవంబర్ 14 (ఈవార్తలు): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలపడుతూ కోస్తాంధ్ర, ఒడిశా తీరాల వైపు కదులుతోందని వాతావరణ శాఖ తెలిపింది. రానున్న 48 గంటల్లో ఇది తుపానుగా మారే అవకాశం ఉందని అంచనా వేసింది. దీని ప్రభావంతో నవంబర్ 18, 19 తేదీల్లో కోస్తాంధ్ర, ఒడిశా తీర ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే సూచనలున్నాయని హెచ్చరించింది. దీంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఆగ్నేయ బంగాళాఖాతం, అండమాన్ సముద్రానికి ఆనుకుని ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కారణంగా అల్పపీడనం ఏర్పడింది. ఇది వాయవ్య దిశగా కదులుతూ నవంబర్ 15 ఉదయానికి వాయుగుండంగా, ఆ తర్వాత మరింత బలపడి నవంబర్ 16 సాయంత్రానికి మధ్య బంగాళాఖాతంలో తుపానుగా మారే అవకాశం ఉందని ఐఎండీ అధికారులు అంచనా వేస్తున్నారు. అండమాన్ నికోబార్ దీవుల్లో నవంబర్ 16 వరకు భారీ వర్షాలు కురుస్తాయని తెలిపారు. తుపాను ప్రభావంతో సముద్రం అల్లకల్లోలంగా మారే అవకాశం ఉందని, అలల ఉద్ధృతి పెరుగుతుందని హెచ్చరించారు. ఇప్పటికే వేటకు వెళ్లిన మత్స్యకారులు నవంబర్ 15లోగా సురక్షితంగా తీరానికి చేరుకోవాలని సూచించారు. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు సముద్రంలోకి వెళ్లవద్దని స్పష్టం చేశారు. నవంబర్ 17 వరకు అండమాన్ సముద్రంలోకి, 15 నుంచి 18 వరకు ఆగ్నేయ బంగాళాఖాతంలోకి, 16 నుంచి 19 వరకు మధ్య బంగాళాఖాతంలోకి చేపల వేటకు వెళ్లడం ప్రమాదకరమని అధికారులు హెచ్చరించారు. తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారుల సూచనలు పాటించాలని కోరారు.

రాహుల్ హామీలన్నీ గాలి మాటలే

గిగ్ వర్కర్లకు ఆరోగ్య భద్రత కల్పిస్తామనడం పెద్ద జోక్: బండి సంజయ్

హైదరాబాద్, నవంబర్ 14 (ఈవార్తలు): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఇచ్చే హామీలన్నీ గాలి మాటలేనని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ విమర్శించారు. గిగ్ వర్కర్లకు ఆరోగ్య భద్రత కల్పిస్తామని చెప్పడం పెద్ద జోక్ అని ఎద్దేవా చేశారు. శనివారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు ఇప్పటికీ అమలుకు నోచుకోలేదని అన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రకటించిన వరంగల్, కామారెడ్డి డిక్లరేషన్ల పరిస్థితి ఏమిటో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పాత హామీలను నెరవేర్చకుండా కొత్తగా మరో హామీ ఇవ్వడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని ఆరోపించారు. రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ పథకానికి కూడా సరిగ్గా నిధులు కేటాయించడం లేదని బండి సంజయ్ విమర్శించారు. ప్రభుత్వ, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతో పాటు జర్నలిస్టులకు ఇచ్చిన హెల్త్ కార్డులు కూడా ఆసుపత్రుల్లో సరిగా పనిచేయడం లేదన్నారు. ఉన్న పథకాలనే సక్రమంగా అమలు చేయలేని ప్రభుత్వం గిగ్ వర్కర్లకు బీమా, ఆరోగ్య భద్రత కల్పిస్తామంటే ప్రజలు ఎలా నమ్ముతారని ప్రశ్నించారు.

ముప్పు ఉంటే నామినేషన్ వేళ అభ్యర్థులకు ఎస్కార్ట్

తిరుపతి, నవంబర్ 14 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లో గ్రామ పంచాయతీ, పెండింగ్‌లో ఉన్న పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు భద్రతా ఏర్పాట్లు పటిష్ఠం చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్‌చంద్ర పునేఠా పోలీసు అధికారులను ఆదేశించారు. నామినేషన్ల సమయంలో దాడి ముప్పు ఉందని భావించే అభ్యర్థులకు ప్రత్యేక ఎస్కార్ట్ కల్పిస్తామని తెలిపారు. తిరుపతి కలెక్టరేట్‌లో సమస్యాత్మకంగా గుర్తించిన 12 జిల్లాల ఐజీలు, డీఐజీలు, ఎస్పీలతో పునేఠా సమీక్ష నిర్వహించారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతల పరిరక్షణ, నామినేషన్ల ప్రక్రియ, పోలింగ్ సజావుగా జరిగేందుకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై చర్చించారు. సమీక్ష అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో పల్నాడు నుంచి రాయలసీమ వరకు కొన్ని ఘర్షణలు చోటుచేసుకున్నాయని చెప్పారు. ఈ నేపథ్యంలో 12 జిల్లాల ఎస్పీలతో ప్రత్యేకంగా మాట్లాడి అప్రమత్తంగా ఉండాలని సూచించినట్లు తెలిపారు. నామినేషన్లు దాఖలు చేసేందుకు వెళ్లే అభ్యర్థులకు ఎస్కార్ట్ అవసరమైతే కల్పిస్తామని, దాడి ముప్పు ఉందని ఎస్పీకి తెలియజేస్తే ప్రత్యేక భద్రత ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. గత ఎన్నికల్లో జరిగిన ఘర్షణలు పునరావృతం కాకుండా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలని పోలీసు యంత్రాంగాన్ని ఆదేశించారు. నామినేషన్ల దాఖలుకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా చూడాలని, సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు.

భారత్ ప్రతిష్టను రాహుల్ దెబ్బతీస్తున్నారు: ఈటల

హైదరాబాద్, నవంబర్ 14 (ఈవార్తలు): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ విదేశాల్లో భారత ప్రతిష్టను దిగజార్చేలా మాట్లాడుతున్నారని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. తెలంగాణలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నియంతృత్వ పోకడలతో వ్యవహరిస్తోందని ఆరోపించారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. విదేశీ గడ్డపై భారత ఎన్నికల వ్యవస్థను, సుప్రీంకోర్టును రాహుల్‌గాంధీ అపహాస్యం చేస్తున్నారని ఈటల ఆరోపించారు. ఆయన మాటలు, తీరు బాధ్యతాయుతమైన ప్రతిపక్ష నేతలా లేవని విమర్శించారు. సైనికులను కూడా అవమానించేలా మాట్లాడుతున్నారని అన్నారు. దేశంలో ప్రజాస్వామ్యం లేకపోతే రాహుల్‌గాంధీ దేశవ్యాప్తంగా పాదయాత్ర ఎలా చేయగలిగారని ప్రశ్నించారు.

మెట్ల బావులకూ చెరువుల తరహా ఎస్‌వోపీలు

తెలంగాణలో 600కు పైగా బావుల గుర్తింపు

జాతీయ స్థాయికి పరిరక్షణ కార్యక్రమం



హైదరాబాద్, నవంబర్ 14 (ఈవార్తలు): తెలంగాణలో చెరువుల పునరుద్ధరణకు అమలు చేస్తున్న స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ (ఎస్‌వోపీలు)ను ఇకపై చారిత్రక మెట్ల బావుల పరిరక్షణకు కూడా వర్తింపజేస్తామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మెట్ల బావుల పరిరక్షణ, అవగాహన కార్యక్రమంలో ఆయన ఈ విషయం వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని భవిష్యత్తులో జాతీయ స్థాయికి విస్తరించే అవకాశాలున్నాయని చెప్పారు. హైదరాబాద్‌లో నీటి ఎద్దడి, వరద నియంత్రణ, కరవు నివారణ అంశాలపై వచ్చే మంగళవారం కేంద్ర హోంశాఖ కార్యదర్శితో సమావేశం కానున్నట్లు రంగనాథ్ తెలిపారు. ఈ భేటీలో చెరువుల సంరక్షణతో పాటు ప్రాచీన మెట్ల బావుల పునరుద్ధరణ అంశాన్ని కూడా చర్చించనున్నట్లు వెల్లడించారు. చెరువులతో పోలిస్తే మెట్ల బావులు వికేంద్రీకృత జల వనరులుగా ఎంతో ఉపయోగపడతాయని ఆయన వివరించారు. గతంలో ఆలయాలు, చెరువుల పరిసరాల్లో ఉన్న అనేక మెట్ల బావులు కాలక్రమేణా కనుమరుగయ్యాయని చెప్పారు. వాటిని గుర్తించి పునరుద్ధరిస్తే భూగర్భ జలమట్టాలు పెరుగుతాయని పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావంతో నీటి కొరత ఏర్పడుతున్న నేపథ్యంలో ఈ చర్యలు అవసరమని అభిప్రాయపడ్డారు. హైదరాబాద్ పరిధిలో దాదాపు అంతరించిపోయిన పలు చెరువులను హైడ్రా ఇప్పటికే పునరుద్ధరించిందని గుర్తుచేశారు. అధికారిక లెక్కల ప్రకారం తెలంగాణవ్యాప్తంగా 600కు పైగా, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 160కి పైగా మెట్ల బావులు ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. క్షేత్రస్థాయిలో ఈ సంఖ్య మరింత ఎక్కువగా ఉండొచ్చన్నారు. కార్యక్రమంలో భాగంగా ఆకర్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ సంప్రదాయ మెట్ల బావులు, పూర్వకాలపు నీటి సంరక్షణ పద్ధతులపై ఏర్పాటు చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. రాష్ట్ర పర్యావరణ, అటవీ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ మాట్లాడుతూ.. ప్రస్తుత నీటి సంక్షోభం నేపథ్యంలో పురాతన నీటి సంరక్షణ పద్ధతులకు ప్రాధాన్యం పెరిగిందన్నారు. సంప్రదాయ జల వనరుల సంరక్షణకు సంబంధించిన అంశాలను క్యూర్ (జఖ=జు) చట్టంలో చేర్చినట్లు వెల్లడించారు.

చంద్రబాబు 'మసాలా' వ్యాఖ్యలపై టీవీకే ఆగ్రహం



విశాఖపట్నం, నవంబర్ 14 (ఈవార్తలు): విశాఖపట్నంలో జరిగిన సీఐఐ భాగస్వామ్య సదస్సులో ఏపీ సీఎం చంద్రబాబు చేసిన 'మసాలా' వ్యాఖ్యలు వివాదానికి దారితీశాయి. తమిళనాడు పారిశ్రామిక రంగంపై ఆయన చేసిన వ్యాఖ్యలను విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ తీవ్రంగా తప్పుబట్టింది. పెట్టుబడులు, ఉద్యోగాల కల్పనలో ఏ రాష్ట్రం ముందుందో 2027 దావోస్ ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో లెక్కలతో తేల్చుకుందామని సవాల్ విసిరింది. పరిశ్రమల తరలింపుపై మీడియా అడిగిన ప్రశ్నకు చంద్రబాబు స్పందిస్తూ.. 'మీకు మసాలా కావాలి.. మాకు ఫలితాలు కావాలి' అని వ్యాఖ్యానించారు. రాష్ట్రాల మధ్య ఆరోగ్యకరమైన పోటీ సహజమని, పెట్టుబడిదారులకు అనుకూలమైన పరిస్థితులు ఎక్కడ ఉంటే అక్కడికే వెళతారని చెప్పారు. పారిశ్రామిక పునాది బలపడే వరకు ప్రారంభంలో రాయితీలు అవసరమని, ఆ తర్వాత వాటిని తగ్గిస్తామని వివరించారు. తమ ప్రభుత్వ విధానాల వల్ల ఏపీకి లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు వస్తున్నాయని పేర్కొన్నారు. చంద్రబాబు వ్యాఖ్యలపై టీవీకే జాతీయ అధికార ప్రతినిధి, సీనియర్ న్యాయవాది సత్యకుమార్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. ఈ మేరకు చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌ను ఉద్దేశించి 'ఎక్స్' వేదికగా ప్రకటన విడుదల చేశారు. తమిళనాడు పారిశ్రామిక ప్రగతి ఆర్భాటం వల్ల సాధ్యపడలేదని, నాణ్యమైన విద్య, సాంకేతికత, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, తరతరాల శ్రమతో ఆ స్థాయికి చేరుకుందని పేర్కొన్నారు. 2027 జనవరిలో జరిగే దావోస్ సదస్సు నాటికి ఏ రాష్ట్రం ఎన్ని పెట్టుబడులు సాధించింది, ఎంతమందికి ఉద్యోగాలు కల్పించిందో లెక్కలతో తేల్చుకుందామని సత్యకుమార్ సవాల్ చేశారు. విజయ్ నాయకత్వంలో తమిళనాడును పెట్టుబడుల ఆకర్షణలో దేశంలోనే అగ్రస్థానంలో నిలిపేందుకు కొత్త పారిశ్రామిక విధానాలతో ముందుకెళ్తున్నామని తెలిపారు.

పాలిటెక్నిక్ కాలేజీలు విద్యాశాఖ పరిధిలోనే

జీవో 97కు సవరణలు.. జీవో 157 జారీ చేసిన ప్రభుత్వం

హైదరాబాద్, నవంబర్ 14 (ఈవార్తలు): పాలిటెక్నిక్ కాలేజీలను కార్మిక శాఖ పరిధిలోకి తీసుకురావాలన్న ప్రతిపాదనపై తెలంగాణ ప్రభుత్వం వెనక్కి తగ్గింది. పాలిటెక్నిక్ కాలేజీలు ఇకపై కూడా ఉన్నత విద్యాశాఖ పరిధిలోనే కొనసాగుతాయని స్పష్టం చేసింది. ఈ మేరకు గతంలో జారీ చేసిన జీవో 97కు సవరణలు చేస్తూ తాజాగా జీవో 157ను విడుదల చేసింది. ఐటీఐలు, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు మాత్రం కార్మిక శాఖ పరిధిలోనే ఉంటాయని పేర్కొంది. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ (వైఐఎస్‌యూ) కూడా విద్యాశాఖ పరిధిలోనే కొనసాగనుంది. కార్మిక, ఉపాధి, శిక్షణ శాఖ పేరును 'శక్తి'గా మారుస్తూ ప్రభుత్వం జులై 3న జీవో 97 జారీ చేసింది. ఇందులో భాగంగా ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలు, ఐటీఐలు, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లను ఆ శాఖ పరిధిలోకి తీసుకురావాలని నిర్ణయించింది. పాలిటెక్నిక్ కోర్సులను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీతో అనుసంధానం చేయాలని కూడా ప్రతిపాదించింది. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ పాలిటెక్నిక్ విద్యార్థులు దాదాపు నెల రోజుల పాటు నిరసనలు చేపట్టారు. విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో ప్రభుత్వం కె.కేశవరావు నేతృత్వంలో ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ నివేదికను పరిశీలించిన అనంతరం పాలిటెక్నిక్ కాలేజీలను విద్యాశాఖ పరిధిలోనే కొనసాగించాలని నిర్ణయించింది. వాటిని స్కిల్స్ యూనివర్సిటీలో విలీనం చేయబోమని స్పష్టం చేసింది. పాలిటెక్నిక్ విద్యను ఆధునీకరించడం, విద్యార్థులు, ఇతర భాగస్వాముల విద్యా, కెరీర్ ప్రయోజనాలను కాపాడే అంశాలపై కమిటీ చేసిన సిఫార్సుల మేరకు ఈ మార్పులు చేసినట్లు ప్రభుత్వం తెలిపింది. విద్యా కార్యక్రమాలను విస్తరించేందుకు ఏఐసీటీఈ, ఇతర సంబంధిత సంస్థల నుంచి అవసరమైన అనుమతులు పొందాలని వైఐఎస్‌యూను ఆదేశించింది.

హైదరాబాద్‌లో తొలిసారి పెట్ ఫెడ్

నవంబర్ 21, 22 తేదీల్లో నోవోటెల్‌లో నిర్వహణ

హైదరాబాద్, నవంబర్ 14 (ఈవార్తలు): పెంపుడు జంతువుల ప్రేమికులు ఆసక్తిగా ఎదురుచూసే 'పెట్ ఫెడ్' ఉత్సవం తొలిసారిగా హైదరాబాద్‌లో జరగనుంది. నగరంలోని నోవోటెల్ హోటల్ ప్రాంగణంలో నవంబర్ 21, 22 తేదీల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. పెట్ ఫెడ్ చరిత్రలో హైదరాబాద్ వేదికగా ఈ వేడుక జరగడం ఇదే తొలిసారి. పెట్ ఫెడ్ 12వ ఎడిషన్‌లో భాగంగా 2026 నవంబర్ నుంచి 2027 మార్చి వరకు దేశంలోని ఐదు ప్రధాన నగరాల్లో ఈ ఉత్సవాన్ని నిర్వహించనున్నారు. హైదరాబాద్‌తో ప్రారంభమయ్యే ఈ పర్యటన ఢిల్లీ, బెంగళూరు, పుణె మీదుగా ముంబైలో ముగియనుంది. రెండు రోజుల పాటు జరిగే ఈ వేడుకలో పెంపుడు జంతువుల కోసం పలు పోటీలు, ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. 'పెట్స్ గాట్ టాలెంట్', ఫ్యాషన్ షో, క్యూటాపలూజా, ఇంటర్నేషనల్ క్యూట్ షో, సెక్యూరిటీ డాగ్ షో సందర్శకులను ఆకట్టుకోనున్నాయి. దేశీయ జాతి కుక్కల యజమానుల కోసం ప్రత్యేక కార్యక్రమాలతో పాటు పెంపుడు జంతువుల ఆటపాటల కోసం ప్లే, ఎజిలిటీ జోన్లు ఏర్పాటు చేస్తున్నారు. జంతువులను దత్తత తీసుకోవాలనుకునేవారి కోసం అడాప్షన్ జోన్లు అందుబాటులో ఉంటాయి. పెంపకం, ఆరోగ్యం, ప్రవర్తన తదితర అంశాలపై నిపుణులతో మాస్టర్‌క్లాస్‌లు నిర్వహిస్తారు. పెట్ ఉత్పత్తుల షాపింగ్ స్టాళ్లను కూడా ఏర్పాటు చేయనున్నారు. పెట్ ఫెడ్ వ్యవస్థాపకుడు అక్షయ్ గుప్తా మాట్లాడుతూ.. ఈ ఉత్సవం కేవలం ఫెస్టివల్‌గా కాకుండా పెంపుడు జంతువుల ప్రేమికులందరినీ కలిపే కమ్యూనిటీగా ఎదిగిందన్నారు. మూగజీవాల పట్ల అవగాహన పెంచడం, వాటి సంరక్షణ బాధ్యతను గుర్తుచేయడం ఈ వేదిక ముఖ్య ఉద్దేశమని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఐపీఎస్ రాజీవ్ హనుమంతుకు గాయాలు

హైదరాబాద్, నవంబర్ 14 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తెలంగాణ సీనియర్ ఐపీఎస్ అధికారి రాజీవ్ హనుమంతు, ఆయన కుటుంబ సభ్యులు గాయపడ్డారు. తిరుమల నుంచి శ్రీశైలానికి వెళ్తుండగా అనంతసాగరం మండలం చావరాళ్లపల్లి వద్ద ఈ ప్రమాదం జరిగింది. ప్రమాద విషయం తెలుసుకున్న తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెంటనే స్పందించారు. రాజీవ్ హనుమంతుకు ఫోన్ చేసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన కుటుంబ సభ్యులతోనూ మాట్లాడి ధైర్యం చెప్పారు. అవసరమైన మెరుగైన వైద్య సేవలు పొందాలని సూచించారు. వైద్య చికిత్స విషయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తెలంగాణ ప్రభుత్వం తరపున అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని పొంగులేటి భరోసా ఇచ్చారు. రాజీవ్ హనుమంతు, ఆయన కుటుంబ సభ్యులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

శ్రీవారి ఫిబ్రవరి దర్శన కోటా విడుదల

18 నుంచి 24 వరకు ఆన్‌లైన్‌లో వివిధ టికెట్లు, గదుల విడుదల

తిరుమల, నవంబర్ 14 (ఈవార్తలు): ఫిబ్రవరి నెలకు సంబంధించిన శ్రీవారి ఆర్జిత సేవలు, దర్శన టికెట్లు, వసతి గదుల కోటాను టీటీడీ నవంబర్ 18 నుంచి 24వ తేదీ వరకు విడతల వారీగా ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈ వివరాలను టీటీడీ వెల్లడించింది. నవంబర్ 18న ఉదయం 10 గంటలకు సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన సేవలకు సంబంధించిన టికెట్ల కోటాను విడుదల చేయనున్నారు. ఈ టికెట్ల కోసం ఎలక్ట్రానిక్ డిప్‌లో నవంబర్ 20 ఉదయం 10 గంటల వరకు నమోదు చేసుకోవచ్చు. టికెట్లు పొందినవారు నవంబర్ 20 నుంచి 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటల్లోపు సొమ్ము చెల్లించాలి. నవంబర్ 21న ఉదయం 10 గంటలకు కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవ టికెట్లను విడుదల చేస్తారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్ల కోటాను అందుబాటులోకి తీసుకురానున్నారు. నవంబర్ 23న ఉదయం 10 గంటలకు అంగప్రదక్షిణ టోకెన్లు, 11 గంటలకు శ్రీవాణి ట్రస్టు దర్శన టికెట్ల కోటాను విడుదల చేస్తారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు వృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారి ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్లను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచుతారు. నవంబర్ 24న ఉదయం 10 గంటలకు ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను, మధ్యాహ్నం 3 గంటలకు తిరుమల, తిరుపతిలో గదుల కోటాను విడుదల చేయనున్నారు.

చుక్కలు చూపిస్తాం

కక్ష రాజకీయాలు చేస్తే వదలం: బొత్స

విజయనగరం, నవంబర్ 14 (ఈవార్తలు): కక్షపూరిత రాజకీయాలు చేసేవారికి రాబోయే రోజుల్లో గట్టిగా బుద్ధి చెబుతామని వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ హెచ్చరించారు. గతంలో మాదిరిగా రాజకీయ ప్రత్యర్థులపై సానుభూతి చూపిస్తూ 'అయ్యో పాపం' అంటూ వదిలేసే పరిస్థితి ఇక ఉండదని స్పష్టం చేశారు. విజయనగరం జిల్లాలో నిర్వహించిన వైసీపీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో మారుతున్న రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు తమ ఆలోచనా విధానాన్ని మార్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో అందరినీ సమానంగా చూసే రాజకీయాలు పనిచేయకపోవచ్చని వ్యాఖ్యానించారు.

ఫోన్‌లో వేధింపులు తట్టుకోలేక మహిళ ఆత్మహత్య

వేములవాడ అర్బన్, నవంబర్ 14 (ఈవార్తలు): ఫోన్‌లో పరిచయమైన వ్యక్తి వేధింపుల కారణంగానే తన కుమార్తె ఆత్మహత్య చేసుకుందని ఓ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వేములవాడ పట్టణంలోని ముదిరాజ్ వీధికి చెందిన వేముల శ్రీలత (35) ప్రైవేట్ స్కూల్ టీచర్‌గా పనిచేస్తోంది. మృతురాలి తల్లి ఉప్పుల చంద్రమ్మ ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం.. గత కొన్ని రోజులుగా ఫోన్‌లో పరిచయమైన ఓ వ్యక్తి శ్రీలతతో అసభ్యంగా ప్రవర్తిస్తూ, బెదిరింపులకు పాల్పడుతూ మానసికంగా వేధిస్తున్నాడు. ఈ వేధింపులు భరించలేక నవంబర్ 13న సాయంత్రం ఇంట్లో ఆమె ఆత్మహత్య చేసుకుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. శ్రీలత భర్త ఉపాధి కోసం గల్ఫ్ దేశంలో ఉంటుండగా, ఆమెకు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వేములవాడ పట్టణ ఇన్‌స్పెక్టర్ వీరప్రసాద్ తెలిపారు.



మల్యాలలో త్రిశూల్ యూత్ క్యారమ్ పోటీలు ప్రారంభం

మల్యాల, నవంబర్ 14 (ఈవార్తలు): యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు గ్రామంలో ఐక్యత, స్నేహభావాన్ని బలోపేతం చేయాలనే ఉద్దేశంతో త్రిశూల్ యూత్ ఆధ్వర్యంలో క్యారమ్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీల్లో యువకులతో పాటు పెద్దలు కూడా ఉత్సాహంగా పాల్గొంటున్నారు. వయసుతో సంబంధం లేకుండా అందరూ ఒకే వేదికపై పోటీపడుతుండటంతో గ్రామంలో క్రీడా సందడి నెలకొంది. క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసాన్ని అందించడంతో పాటు మనుషుల మధ్య స్నేహసంబంధాలను పెంపొందిస్తాయని నిర్వాహకులు తెలిపారు. యువతను క్రీడల వైపు ప్రోత్సహిస్తూ గ్రామ ప్రజలందరినీ ఒకచోట చేర్చడమే పోటీల ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. పోటీలకు గ్రామస్థుల నుంచి మంచి స్పందన లభిస్తోందని, పాల్గొంటున్న క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు.



ఒకరోజు కలెక్టర్‌గా విద్యార్థిని శ్రీనిధి

మల్యాల, నవంబర్ 14 (ఈవార్తలు): విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం పెంపొందించడంతో పాటు ప్రభుత్వ పరిపాలనా వ్యవస్థపై అవగాహన కల్పించే ఉద్దేశంతో మల్యాల మండలం నుకపల్లిలోని ప్రతిభ హైస్కూల్‌లో బాలల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా చేపట్టిన 'ఒకరోజు కలెక్టర్' కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థిని దూస శ్రీనిధికి ఒకరోజు కలెక్టర్ బాధ్యతలు అప్పగించారు. కలెక్టర్ హోదాలో పాఠశాల కార్యక్రమాలను పరిశీలించిన ఆమె.. విద్యార్థుల సమస్యలు, మౌలిక వసతులు, విద్యా ప్రమాణాలు, పాఠశాల అభివృద్ధికి సంబంధించిన అంశాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం, సామాజిక బాధ్యత, ఆత్మవిశ్వాసం పెంపొందించడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని పాఠశాల యాజమాన్యం తెలిపింది. చిన్న వయసు నుంచే ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని వాటిని సాధించేలా విద్యార్థులను ప్రోత్సహించడం మంచి పరిణామమని పలువురు అభినందించారు.



దూదేకుల ఆత్మగౌరవ

భవన్‌కు రూ.3 కోట్లు

జగిత్యాల, నవంబర్ 14 (ఈవార్తలు): దూదేకుల సామాజికవర్గ చిరకాల స్వప్నం నెరవేరే దిశగా అడుగు పడింది. కొకాపేటలో దూదేకుల ఆత్మగౌరవ భవన్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.3 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఈ మేరకు బీసీ సంక్షేమ శాఖ 2026 నవంబర్ 2న జీవో ఎంఎస్ నంబర్ 51 జారీ చేసింది. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం కొకాపేటలో గతంలో కేటాయించిన రెండున్నర ఎకరాల స్థలంలో ఈ భవనాన్ని నిర్మించనున్నారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడంపై దూదేకుల సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జాక్ చైర్మన్ మహమ్మద్ రఫీ, జాయింట్ సెక్రటరీ ఇబ్రహీం, జగిత్యాల పట్టణ నూరుబాషా (దూదేకుల) సంఘం అధ్యక్షుడు రహీం, ప్రధాన కార్యదర్శి ఎండీ రియాజ్, ఉపాధ్యక్షుడు సమీ, కోశాధికారి చాంద్ మియా, ఎండీ షఫీ, అఫ్సర్, అజీం, షరీఫ్, నసీరుద్దీన్, మాజీద్, అజాం, సలీం, ఇబ్రహీం, ఆరిఫ్, బషీర్ తదితరులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

20, 21 తేదీల్లో జగిత్యాల జిల్లా సైన్స్ ఎగ్జిబిషన్

జగిత్యాల, నవంబర్ 14 (ఈవార్తలు): విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు ఈ నెల 20, 21 తేదీల్లో జగిత్యాల ప్రభుత్వ పురాతన ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి కె. రాము తెలిపారు. ఈ ప్రదర్శనలో బాల వైజ్ఞానిక ప్రదర్శన, ఇన్‌స్పైర్ అవార్డులు, పీఎం శ్రీ పాఠశాలల ప్రదర్శనలు ఉంటాయని వెల్లడించారు. బాల వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొనే 6 నుంచి 12వ తరగతి విద్యార్థులు నవంబర్ 17లోగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఇన్‌స్పైర్ అవార్డులకు ఎంపికైన 136 మంది విద్యార్థులు తప్పనిసరిగా హాజరుకావాలని తెలిపారు. ప్రదర్శనలో విద్యార్థులకు సెమినార్, ఉపాధ్యాయులకు బోధనా సామగ్రి ప్రదర్శన కూడా నిర్వహించనున్నట్లు డీఈవో పేర్కొన్నారు.

'స్వస్థ యువ - వికసిత భారత్' థీమ్‌తో క్రీడా పోటీలు

హైదరాబాద్, నవంబర్ 14 (ఈవార్తలు) (పీఐబీ): మై భారత్ హైదరాబాద్ ఆధ్వర్యంలో 'స్వస్థ యువ - వికసిత భారత్' థీమ్‌తో క్లస్టర్ ఆఫ్ బ్లాక్ స్థాయి క్రీడా పోటీలను నిర్వహించారు. సికింద్రాబాద్‌లోని సంస్కార్ ఇన్నోవేటివ్ స్కూల్‌లో నవంబర్ 13, 14 తేదీల్లో రెండు రోజుల పాటు ఈ పోటీలు జరిగాయి. '100 వారాల ప్రచార కార్యక్రమం - నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్'లో భాగంగా 9వ వారం కార్యక్రమాన్ని నిర్వహించారు. యువతలో శారీరక దృఢత్వం, క్రీడా స్ఫూర్తి, జట్టు సమన్వయం పెంపొందించడంతో పాటు మాదకద్రవ్యాలకు దూరంగా ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సుబేదార్ మేజర్ రాజీవ్ కుమార్ మాట్లాడుతూ యువత క్రీడల్లో చురుగ్గా పాల్గొనాలని, ఆరోగ్యకరమైన, అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సర్వీసెస్ క్రీడాకారుడు సుబ్ వర్గీస్ మాథ్యూ (రిటైర్డ్) గౌరవ అతిథిగా పాల్గొన్నారు. మై భారత్ హైదరాబాద్ అసిస్టెంట్ డైరెక్టర్, జిల్లా యువజన అధికారి ఇన్‌చార్జి గంట రాజేష్ కార్యక్రమ లక్ష్యాలను వివరించారు. ఫిజికల్ డైరెక్టర్ నరేంద్ర బాబు సమన్వయం చేయగా, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ వి. మల్లారెడ్డి రిఫరీగా వ్యవహరించారు. ఆరు క్రీడా విభాగాల్లో పోటీలు నిర్వహించారు. వాలీబాల్‌లో ఎం. యశ్వంత్ జట్టు, టగ్ ఆఫ్ వార్‌లో ఎం. మహాలక్ష్మి జట్టు విజయం సాధించాయి. అథ్లెటిక్స్ పురుషుల విభాగంలో చి. లక్ష్మణ్, మహిళల విభాగంలో గౌతమి విజేతలుగా నిలిచారు. బ్యాడ్మింటన్ పురుషుల విభాగంలో వసికర్, మహిళల విభాగంలో మహాలక్ష్మి గెలుపొందారు. ప్రచార కార్యక్రమంలో భాగంగా పాల్గొన్న యువతతో నషా ముక్త్ ప్రతిజ్ఞ చేయించారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ, మాదకద్రవ్య రహిత భారతదేశ నిర్మాణానికి కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. విజేతలకు బహుమతులు, పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. మిగతా క్రీడాకారులకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు ఇచ్చారు.



రాజన్న ఆలయ అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలి

కార్మికుల సంఖ్య పెంచాలి: ఆది శ్రీనివాస్

వేములవాడ అర్బన్, నవంబర్ 14 (ఈవార్తలు): వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. ప్రతి పనికి ప్రణాళిక ప్రకారం గడువు విధించి, ఆలోగా పూర్తి చేయాలని సూచించారు. వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (వీటీఏడీఏ) ఆధ్వర్యంలో జరుగుతున్న పనులపై శనివారం భీమేశ్వర స్వామి ఆలయ గెస్ట్‌హౌస్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆది శ్రీనివాస్‌తో పాటు దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఆర్ అండ్ బీ చీఫ్ ఇంజినీర్ రాజేశ్వర్ రెడ్డి, ఆర్కిటెక్ట్, ధార్మిక సలహాదారు పాల్గొన్నారు. ఇప్పటివరకు పూర్తయిన పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పనులన్నీ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు. పనుల వేగానికి అనుగుణంగా కార్మికుల సంఖ్యను మరింత పెంచాలని సూచించారు. సమావేశంలో ధార్మిక సలహాదారు గోవింద హరి, ఆలయ ఈవో రమాదేవి, ఆర్డీవో కేఎస్‌బీ కుమారి, ఆర్ అండ్ బీ ఈఈ భీమ్లానాయక్, స్థపతులు జయేంద్రన్, గణేష్, స్ట్రక్చరల్ ఇంజినీర్ శ్రీధర్ రెడ్డి, తహసీల్దార్ జయంత్ తదితరులు పాల్గొన్నారు.





మెట్‌పల్లి జాబ్‌మేళాలో 750 మందికి ఉద్యోగావకాశాలు

మెట్‌పల్లి, నవంబర్ 14 (ఈవార్తలు): కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ఆధ్వర్యంలో మెట్‌పల్లిలోని వెంకట్‌రెడ్డి గార్డెన్స్‌లో నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. 1,500 మందికి పైగా నిరుద్యోగ యువత, విద్యార్థులు హాజరుకాగా, సుమారు 750 మందికి ఉద్యోగావకాశాలు లభించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతకు ఉపాధి కల్పించి వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా అందించాలనే లక్ష్యంతో జాబ్‌మేళా నిర్వహించినట్లు చెప్పారు. హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన ప్రముఖ కంపెనీలను ఒకే వేదికపైకి తీసుకొచ్చి స్థానిక యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడం సంతోషంగా ఉందన్నారు. ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లి ఇబ్బందులు పడకుండా స్థానికంగానే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించి యువతకు అండగా నిలుస్తామని తెలిపారు. జాబ్‌మేళాలో లభించిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని యువతకు సూచించారు. నియోజకవర్గ యువత భవిష్యత్తుకు భరోసా కల్పించేలా రానున్న రోజుల్లోనూ ఇలాంటి కార్యక్రమాలు కొనసాగిస్తామని సంజయ్ తెలిపారు.

బలవంతపు వసూళ్లకు పాల్పడితే కేసులు

ట్రాన్స్‌జెండర్లకు వేములవాడ డీఎస్పీ హెచ్చరిక

వేములవాడ అర్బన్, నవంబర్ 14 (ఈవార్తలు): ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వేములవాడ డీఎస్పీ శ్రీనివాసులు హెచ్చరించారు. జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఆదేశాల మేరకు శనివారం వేములవాడ రూరల్ సర్కిల్ కార్యాలయంలో ట్రాన్స్‌జెండర్లతో పోలీసులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి వచ్చే భక్తులతో పాటు ఇతర దేవాలయాలను సందర్శించే ప్రజలను ఇబ్బందులకు గురిచేయరాదని సూచించారు. శాపనార్థాలు పెట్టడం, బలవంతంగా డబ్బులు వసూలు చేయడం, శుభకార్యాల వద్ద అక్రమ వసూళ్లకు పాల్పడటం వంటి చర్యలకు దూరంగా ఉండాలని స్పష్టం చేశారు. ఇలాంటి వ్యవహారాలపై ఫిర్యాదులు వస్తే కేసులు నమోదు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్ల సమస్యల పరిష్కారానికి పోలీస్ శాఖ అందుబాటులో ఉంటుందని తెలిపారు. వారి గౌరవానికి భంగం కలిగించినా, వేధింపులకు గురిచేసినా, దూషించినా లేదా ఉపాధి, సంక్షేమానికి సంబంధించిన సమస్యలు ఎదురైనా పోలీసులను సంప్రదించాలని సూచించారు. ట్రాన్స్‌జెండర్ ప్రొటెక్షన్ సెల్ ద్వారా ఫిర్యాదు చేసి న్యాయం పొందవచ్చన్నారు. ట్రాన్స్‌జెండర్ల హక్కులకు భంగం కలిగించినా, వారిని వేధించినా ట్రాన్స్‌జెండర్ పర్సన్స్ (ప్రొటెక్షన్ ఆఫ్ రైట్స్) యాక్ట్-2019 ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్, రూరల్ సీఐ శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.





నంబర్ ప్లేట్లు సరిగా లేని 95 వాహనాలపై చర్యలు

జగిత్యాల, నవంబర్ 14 (ఈవార్తలు): నంబర్ ప్లేట్లు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా ప్లేట్లు ఏర్పాటు చేసుకుని తిరుగుతున్న వాహనాలపై జగిత్యాల ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మొత్తం 95 వాహనాలను గుర్తించి చర్యలు తీసుకున్నారు. జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాలు, డీఎస్పీ పురుషోత్తంరెడ్డి సూచనల మేరకు పట్టణ సీఐ పి. కరుణాకర్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ ఎస్ఐ మల్లేష్, సిబ్బంది ఈ తనిఖీలు చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా నంబర్ ప్లేట్లు ఏర్పాటు చేసుకున్న వాహన యజమానులకు జరిమానాలు విధించారు. సరైన ప్రమాణాలతో నంబర్ ప్లేట్లు ఏర్పాటు చేసుకోవడంపై అవగాహన కల్పించి కౌన్సెలింగ్ నిర్వహించారు. పోలీసుల సూచనల మేరకు పలువురు వాహనదారులు తమ వాహనాలకు ముందు, వెనుక వైపులా నిబంధనలకు అనుగుణంగా కొత్త నంబర్ ప్లేట్లు ఏర్పాటు చేసుకున్నారు. ప్రతి వాహనానికి నిబంధనల ప్రకారం ప్రామాణిక నంబర్ ప్లేట్లు తప్పనిసరిగా ఉండాలని సీఐ పి. కరుణాకర్ సూచించారు. నంబర్ ప్లేట్లు లేకుండా లేదా నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలని కోరారు.



6 రోజులు అంజన్న మూలవిరాట్ దర్శనం నిలిపివేత

మల్యాల, నవంబర్ 14 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో 60 ఏళ్ల తర్వాత చందన సమర్పణ, మహా సంప్రోక్షణ మహోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో అంజనారెడ్డి తెలిపారు. ఈ నెల 15 నుంచి 20వ తేదీ వరకు ఉత్సవాలు జరగనున్న నేపథ్యంలో మూలవిరాట్ దర్శనంతో పాటు అన్ని ఆర్జిత సేవలు, వాహన పూజలు, వీఐపీ దర్శనాలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు. శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఆరు రోజులు భక్తులకు బాలాలయంలో స్వామివారి దర్శనం కల్పిస్తామని చెప్పారు. సిఫారసు లేఖలను కూడా పరిగణనలోకి తీసుకోబోమని స్పష్టం చేశారు. నవంబర్ 21 నుంచి డిసెంబర్ 29 వరకు స్వామివారి నిజరూప దర్శనంతో పాటు అన్ని సేవలు యథావిధిగా కొనసాగుతాయని తెలిపారు. డిసెంబర్ 29న మండల పూజ నిర్వహిస్తామన్నారు. సుమారు రూ.20 లక్షల వ్యయంతో ఉత్సవాలు నిర్వహిస్తున్నామని, రోజుకు లక్ష మంది భక్తులు వచ్చే అవకాశం ఉండటంతో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. విరాళాలు ఇచ్చే భక్తులు తప్పనిసరిగా రశీదు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఆలయ ఏఈవో హరినాథ్, సూపరింటెండెంట్ సునీల్ పాల్గొన్నారు.

దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలి: కేటీఆర్

జగిత్యాల, నవంబర్ 14 (ఈవార్తలు): నవంబర్ 29న నిర్వహించనున్న దీక్షా దివస్ కార్యక్రమానికి ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు పిలుపునిచ్చారు. శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తెలంగాణ సాధన కోసం కేసీఆర్ చేపట్టిన దీక్షకు గుర్తుగా నిర్వహించే దీక్షా దివస్ కార్యక్రమ ఏర్పాట్లపై చర్చించారు. నాయకులు, కార్యకర్తల భాగస్వామ్యం, నియోజకవర్గాల వారీగా జనసమీకరణపై దిశానిర్దేశం చేశారు. తెలంగాణ ఉద్యమంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా కీలక పాత్ర పోషించిందని కేటీఆర్ గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో ప్రతి నియోజకవర్గం నుంచి భారీగా తరలిరావాలని సూచించారు. సమావేశంలో మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, తాటిపర్తి జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ జడ్పీ చైర్మన్లు, నియోజకవర్గ ఇన్‌చార్జులు, జిల్లా అధ్యక్షులు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.





పుస్తక పఠనంతో జ్ఞానాన్ని పెంచుకోవాలి

విద్యతోనే వికాసం సాధ్యం: ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాల, నవంబర్ 14 (ఈవార్తలు): విద్యతోనే వికాసం సాధ్యమని, పుస్తకాలు చదవడం ద్వారా జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. శనివారం జిల్లా గ్రంథాలయంలో 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు పాఠ్యపుస్తకాలతో పాటు విజ్ఞానాన్ని పెంచే ఇతర పుస్తకాలను కూడా చదవాలని సూచించారు. గ్రంథాలయ భవన నిర్మాణానికి రూ.కోటి మంజూరు చేయించి, పనులు దాదాపు పూర్తి చేసినట్లు తెలిపారు. గ్రంథాలయాల అభివృద్ధికి మరిన్ని నిధులు కేటాయించేలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంఘనబట్ల దినేష్, డీసీసీ అధ్యక్షుడు గాజంగి నందయ్య, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



భారత్ సమ్మిట్‌కు వ్యతిరేకంగా బీజేపీ నిరసన

రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దగ్ధం

జగిత్యాల, నవంబర్ 14 (ఈవార్తలు): తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న భారత్ సమ్మిట్‌ను వ్యతిరేకిస్తూ బీజేపీ నాయకులు శనివారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని తహసీల్ చౌరస్తాలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరిబాబు మాట్లాడుతూ భారత్ వ్యతిరేక శక్తులతో సమ్మిట్ నిర్వహించడం సరికాదని విమర్శించారు. పెట్టుబడుల ఆకర్షణ పేరుతో ప్రజాస్వామ్యం, సామాజిక, ఆర్థిక న్యాయం, యువత, ఎస్ఐఆర్ వంటి అంశాలను చర్చకు తీసుకురావడం వెనుక రాజకీయ ఉద్దేశాలున్నాయని ఆరోపించారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో లేని రాహుల్ గాంధీని ముఖ్య అతిథిగా ఆహ్వానించి కాంగ్రెస్ ప్రచారానికి వేదికగా మార్చుకుంటున్నారని విమర్శించారు. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ నాయకత్వాన్ని ప్రసన్నం చేసుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కాశెట్టి తిరుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి శ్రీనివాస్, నాయకులు వేముల శ్రీనివాస్, సిరిపురం శ్రీనివాస్, స్వరూప వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఐఐటీ రూర్కీలో విద్యార్థి మృతి

70 సెమిస్టర్ పరీక్షలు వాయిదా.. హాస్టల్ గదిలో లేఖ లభ్యం

న్యూఢిల్లీ, నవంబర్ 14: ఉత్తరాఖండ్‌లోని ప్రతిష్ఠాత్మక ఐఐటీ రూర్కీలో విద్యార్థి అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం కలకలం రేపింది. ఈ ఘటనతో నవంబర్ 13న జరగాల్సిన సుమారు 70 సెమిస్టర్ పరీక్షలను యాజమాన్యం వాయిదా వేసింది. ఈ పరీక్షలను నవంబర్ 22న నిర్వహించనున్నట్లు ప్రకటించింది. ఈ విషయాన్ని విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు తెలియజేసింది. మృతుడిని ఘజియాబాద్‌లోని రాజ్‌నగర్ ఎక్స్‌టెన్షన్‌కు చెందిన 20 ఏళ్ల ఆయుష్ రజౌరియాగా గుర్తించారు. ఆయన మ్యాథమెటిక్స్ అండ్ కంప్యూటింగ్ విభాగంలో బీఎస్-ఎంఎస్ రెండో సంవత్సరం చదువుతున్నారు. గురువారం అర్ధరాత్రి గోవింద్ భవన్ హాస్టల్‌లోని రెండో అంతస్తులో ఉన్న బీఎస్-10 గదిలో ఆయుష్ అచేతనంగా పడి ఉండటాన్ని గుర్తించారు. వెంటనే అధికారులకు, పోలీసులకు సమాచారం అందించారు. గదిలో ఓ లేఖ లభించినట్లు సమాచారం. తాను డిప్రెషన్, మానసిక వేదనతో బాధపడుతున్నట్లు అందులో ఆయుష్ పేర్కొన్నట్లు తెలుస్తోంది. గత ఏడాది కాలంగా క్యాంపస్‌లోని వెల్‌నెస్ సెంటర్‌లో కౌన్సెలింగ్ తీసుకుంటున్నట్లు అధికారులు వెల్లడించారు. ఆయుష్ మృతిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పోస్ట్‌మార్టం నివేదికతో పాటు లేఖ ఆధారంగా అన్ని కోణాల్లో విచారణ జరుపుతున్నారు. ఈ ఘటనపై ఐఐటీ రూర్కీ యాజమాన్యం విచారం వ్యక్తం చేస్తూ మృతుడి కుటుంబానికి సానుభూతి తెలిపింది.

మోకాలి ఇంప్లాంట్ల ధరల పరిమితి పొడిగింపు

న్యూఢిల్లీ, నవంబర్ 14: మోకాలి మార్పిడి శస్త్రచికిత్సల్లో ఉపయోగించే ఇంప్లాంట్ల గరిష్ఠ ధరల పరిమితిని 2027 జనవరి 15 వరకు పొడిగిస్తూ కేంద్ర ఔషధ ధరల నియంత్రణ సంస్థ (ఎన్‌పీపీఏ) నిర్ణయం తీసుకుంది. కేంద్ర రసాయనాలు, ఎరువుల మంత్రిత్వ శాఖ పరిధిలోని ఫార్మాస్యూటికల్స్ విభాగం ఈ వివరాలను వెల్లడించింది. గతంలో నిర్ణయించిన గడువు నవంబర్ 15తో ముగియనుండగా, తదుపరి సవరణ నోటిఫికేషన్ వచ్చే వరకు ధరల పరిమితి కొనసాగుతుందని ఎన్‌పీపీఏ తెలిపింది.

అభివృద్ధి కోసం కేంద్రంతో కలిసి పనిచేస్తాం

రాజకీయాల్లో పోటీ.. అభివృద్ధిలో సహకారం: డీకే శివకుమార్



బెంగళూరు, నవంబర్ 14: రాజకీయ ప్రత్యర్థులుగా ఉన్నప్పటికీ రాష్ట్ర అభివృద్ధి విషయంలో కేంద్రంతో కలిసి పనిచేస్తామని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో తనకు సత్సంబంధాలు ఉన్నాయంటూ జరుగుతున్న చర్చలపై స్పందిస్తూ.. రాజకీయాలను, అభివృద్ధిని వేర్వేరుగా చూడాలని అన్నారు. రాజకీయాల్లో పోటీ పడతామని, అభివృద్ధి పనుల్లో సహకరించుకుంటామని పేర్కొన్నారు. బెంగళూరులో శుక్రవారం పింక్‌లైన్ మెట్రో ప్రారంభోత్సవంతో పాటు పలు కార్యక్రమాల్లో మోదీతో శివకుమార్ సరదాగా మాట్లాడటం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. దీనిపై శనివారం మీడియాతో మాట్లాడిన ఆయన.. ఆ సందర్భాలను ఎవరికి నచ్చినట్లు వారు అర్థం చేసుకోవచ్చన్నారు. ప్రజాప్రతినిధిగా రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రం దృష్టికి తీసుకెళ్లాల్సిన అంశాలను ప్రస్తావించానని తెలిపారు. మేకెదాటు ప్రాజెక్టుకు అవసరమైన అనుమతులు ఇప్పించాలని మోదీని కోరినట్లు చెప్పారు. ఈ ప్రాజెక్టుకు సుప్రీంకోర్టు ఆమోదం తెలిపిందని, రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు అఖిలపక్ష బృందంతో ఢిల్లీ వెళ్లేందుకు అంగీకరించాయని వెల్లడించారు. అటవీ, పర్యావరణ అనుమతులతో పాటు పెండింగ్‌లో ఉన్న అంశాలను పరిష్కరించాలని ప్రధానిని కోరినట్లు తెలిపారు. కస్తూరిరంగన్ నివేదికను తిరస్కరించాలని, మెట్రో ప్రాజెక్టు సమస్యల పరిష్కారానికి సాంకేతిక కమిటీ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. మెట్రో ప్రాజెక్టు వ్యయంలో రాష్ట్రానికి సమాన వాటా ఇవ్వాలని, బెంగళూరులో 500 కిలోమీటర్ల మేర మెట్రో మార్గాల లక్ష్యాన్ని చేరుకునేందుకు పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరినట్లు వివరించారు. డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ల నిర్మాణంపైనా మోదీతో చర్చించానన్నారు. బెంగళూరు అభివృద్ధి శాఖ మంత్రి కృష్ణ బైరేగౌడతో కలిసి నగర అవసరాలను ప్రధానికి వివరించినట్లు చెప్పారు. ఇతర ప్రాంతాల్లో రహదారులు మొత్తం విస్తీర్ణంలో 18-20 శాతం ఉంటే బెంగళూరులో ఆ వాటా 8 శాతమేనని శివకుమార్ తెలిపారు. భూసేకరణకు చదరపు అడుగుకు సుమారు రూ.50 వేల పరిహారం చెల్లించాల్సి వస్తోందని, అయినా ఫ్లైఓవర్ల నిర్మాణ వ్యయంలో రాష్ట్ర వాటా భరించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. రాష్ట్ర డిమాండ్లపై అఖిలపక్ష బృందంతో ఢిల్లీకి వెళతానని పునరుద్ఘాటించారు.

30 రోజుల్లోనే శబరిమల రోడ్డు పనులు పూర్తి



తిరువనంతపురం, నవంబర్ 14: శబరిమల అయ్యప్ప భక్తులకు ఊరట కలిగించేలా చలక్కాయం-పంబ రహదారి ఆధునికీకరణ పనులు పూర్తయ్యాయి. సుమారు రూ.15 కోట్ల వ్యయంతో చేపట్టిన 4.5 కిలోమీటర్ల రహదారి పనులను పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ (పీడబ్ల్యూడీ) కేవలం 30 రోజుల్లోనే పూర్తి చేసింది. వాస్తవానికి ఈ ప్రాజెక్టుకు తొమ్మిది నెలల గడువు ఉండగా, యాత్రా సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని పనులను వేగంగా ముగించారు. శబరిమల కొండపైకి వెళ్లే భక్తులకు పంబ బేస్ క్యాంప్‌గా ఉంటుంది. రోడ్డు మార్గంలో వచ్చే వారు పంబ చేరుకోవడానికి చలక్కాయం-పంబ రహదారే ప్రధాన మార్గం. రానున్న వారాల్లో లక్షలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో ఈ రహదారిని 12 మీటర్ల వెడల్పుకు విస్తరించారు. ప్రమాదకరమైన మలుపుల వద్ద క్రాష్ బారియర్లు, సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. రోడ్డు మార్కింగ్స్‌తో పాటు ఇరువైపులా కాంక్రీట్ ఇంటర్‌లాకింగ్ బ్లాక్‌లను అమర్చారు. ఆగస్టు 14న ఈ రహదారిని ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు నుంచి పీడబ్ల్యూడీకి అప్పగించారు. సెప్టెంబర్ 17న పరిపాలనా అనుమతులు లభించగా, సెప్టెంబర్ 30 నాటికి టెండర్ల ప్రక్రియ పూర్తయింది. అక్టోబర్ 13న పనులు ప్రారంభించి నవంబర్ 13 నాటికి పూర్తి చేశారు. ముఖ్యమంత్రి వి.డి. సతీశన్ అధ్యక్షతన జరిగిన సమీక్షా సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు పనులను వేగవంతం చేశారు. పనుల సమయంలో తారు కొరత, నిర్మాణ సామగ్రి రవాణాలో జాప్యం, ప్రతికూల వాతావరణం, వాహనాల రాకపోకల ఆంక్షలు ఎదురైనా నిర్మాణాన్ని కొనసాగించారు. రహదారికి రెండు వైపుల నుంచి రెండు బృందాలు పనులు చేపట్టాయి. ఆలయంలో ప్రత్యేక పూజల సందర్భంగా ఏడు రోజుల పాటు భక్తుల రద్దీ ఉన్నప్పటికీ పోలీసుల సహకారంతో ట్రాఫిక్‌ను నియంత్రిస్తూ పనులు పూర్తి చేశారు. తొమ్మిది నెలల్లో పూర్తి కావాల్సిన పనులను 30 రోజుల్లోనే ముగించడం గొప్ప విజయమని ప్రజా పనుల శాఖ మంత్రి పి.కె. బషీర్ పేర్కొన్నారు. ప్రభుత్వ శాఖల సమన్వయం, ముఖ్యమంత్రి సహకారంతోనే ఇది సాధ్యమైందని తెలిపారు.

రూ.900 కోట్ల విలువైన షేర్లు కోల్పోనున్న హువాంగ్

న్యూఢిల్లీ, నవంబర్ 14: చిప్ తయారీ సంస్థ ఎన్విడియా సహ వ్యవస్థాపకుడు జెన్సన్ హువాంగ్ కంపెనీ నుంచి వైదొలగితే సుమారు 108 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.900 కోట్లు) విలువైన అన్‌వెస్టెడ్ స్టాక్ అవార్డులను కోల్పోనున్నారని బ్లూమ్‌బెర్గ్ డేటాను ఉటంకిస్తూ పలు నివేదికలు వెల్లడించాయి. ఎన్విడియా ఈక్విటీ పరిహార విధానం ప్రకారం కంపెనీని వీడి వెళ్లే ఎగ్జిక్యూటివ్‌లకు ఇంకా బదిలీ కాని రిస్ట్రిక్టెడ్ స్టాక్ యూనిట్ల (ఆర్ఎస్‌యూలు)పై హక్కు ఉండదు. ఈ నిబంధన ప్రకారం హువాంగ్ వద్ద ఉన్న సుమారు 3.46 లక్షల ఆర్ఎస్‌యూలతో పాటు, పనితీరు ఆధారంగా భవిష్యత్తులో లభించాల్సిన అదనపు షేర్లను కూడా కోల్పోయే అవకాశం ఉందని నివేదికలు పేర్కొన్నాయి. అయితే ఈ మొత్తం ఆయన సంపదతో పోలిస్తే చాలా స్వల్పం. ప్రస్తుతం హువాంగ్ నికర సంపద 138 బిలియన్ డాలర్ల నుంచి 144.5 బిలియన్ డాలర్ల మధ్య ఉంటుందని అంచనా. ఈ లెక్కన రూ.900 కోట్లు ఆయన మొత్తం సంపదలో 0.07 నుంచి 0.08 శాతం మాత్రమే. హువాంగ్ ఇప్పటికీ ఎన్విడియాలో అతిపెద్ద వ్యక్తిగత వాటాదారుగా కొనసాగుతున్నారు. కంపెనీలో ఆయనకు సుమారు 3.5 శాతం వాటా ఉందని, దాని కింద 812 మిలియన్ షేర్లు ఉన్నాయని నివేదికలు తెలిపాయి. వాటి విలువ దాదాపు 135 బిలియన్ డాలర్లుగా అంచనా వేశారు.

సైబర్‌ట్రక్ తయారీ మరికొంతకాలం

పెండింగ్ ఆర్డర్ల కోసమే గడువు పొడిగింపు: మస్క్

న్యూఢిల్లీ, నవంబర్ 14: టెస్లా సైబర్‌ట్రక్ తయారీని వచ్చే ఏడాది వేసవి చివరి వరకు కొనసాగించాలని ఎలాన్ మస్క్ నిర్ణయించారు. గతంలో ఈ పికప్ ట్రక్ ఉత్పత్తిని వచ్చే ఏడాది మధ్యలో నిలిపివేయనున్నట్లు ప్రకటించిన ఆయన.. పెండింగ్ ఆర్డర్లను పూర్తి చేసేందుకు గడువు పొడిగించినట్లు వెల్లడించారు. దీంతో టెక్సాస్‌లోని గిగాఫ్యాక్టరీలో మరో రెండు, మూడు నెలల పాటు సైబర్‌ట్రక్ తయారీ కొనసాగనుంది. సైబర్‌ట్రక్ ఉత్పత్తిని తగ్గించి, ఆ సామర్థ్యాన్ని రోబోట్యాక్సీ అయిన సైబర్‌క్యాబ్ తయారీకి వినియోగించాలని టెస్లా గతంలో నిర్ణయించింది. అయితే సైబర్‌ట్రక్ కోసం ఎదురుచూస్తున్న వినియోగదారుల ఆర్డర్లు పెండింగ్‌లో ఉండటంతో ఉత్పత్తిని మరికొంతకాలం కొనసాగించాలని మస్క్ భావించారు. నిర్దిష్ట గడువులోగా వాహనాలను తయారు చేయలేకపోతే కొందరు కొనుగోలుదారులకు డిపాజిట్లు తిరిగి ఇవ్వాల్సి రావచ్చని కూడా ఆయన సూచించారు. ఉత్పత్తి గడువు పొడిగించడం లాభాల పరంగా సరైన నిర్ణయం కాకపోవచ్చని ఎక్స్‌లో పేర్కొన్నారు.

ఉబర్‌లో డేటా లీక్ కలకలం

డ్రైవర్ల లైసెన్స్ వివరాలు సహా వ్యక్తిగత సమాచారం బహిర్గతం

న్యూఢిల్లీ, నవంబర్ 14: ప్రముఖ రైడ్‌హెయిలింగ్ సంస్థ ఉబర్‌లో మరోసారి డేటా లీక్ కలకలం రేగింది. సంస్థ భాగస్వామ్య సంస్థ 'ఫ్లైర్‌వర్క్స్ ఏఐ'కు చెందిన భద్రతా లోపం కారణంగా డ్రైవర్ల వ్యక్తిగత సమాచారం బయటపడినట్లు ఉబర్ వెల్లడించింది. ఇందులో డ్రైవింగ్ లైసెన్స్ వివరాలు కూడా ఉన్నట్లు సమాచారం. ఫ్లైర్‌వర్క్స్ ఏఐ సంస్థకు చెందిన ఇంటర్నల్ లాగిన్ వివరాలను గుర్తుతెలియని వ్యక్తి దొంగిలించి, వాటి ద్వారా ఉబర్‌కు సంబంధించిన డేటాను యాక్సెస్ చేసినట్లు నివేదికలు తెలిపాయి. అక్టోబర్ 9న ఈ విషయాన్ని గుర్తించిన ఉబర్.. వెంటనే ఆ సంస్థతో డేటా సంబంధాలను నిలిపివేసి విచారణ ప్రారంభించింది. ఈ ఘటనలో ఎంతమంది ప్రభావితమయ్యారనే వివరాలను ఉబర్ వెల్లడించలేదు.

VANGS GLOBAL TECHNOLOGIES LLP
DASARA SPECIAL OFFER
Launch Your Cloud-Hosted ePaper Today
Powering modern newsrooms with AI-powered image extraction & multi-language support
ePaper Pro
దసరా శుభాకాంక్షలు
20% OFF ON EVERY PLAN

NEWS ONLY website · web stories · breaking news

Standard 5 GB · 5 users — SAVE 20%
✓ Automatic PDF extraction
✓ Custom domain & push alerts
✓ Web stories, gallery, headlines
✓ Country & device-wise views
₹8,124 ₹6,499
20% OFF · SAVE ₹1,625 / YEAR

Expanded 10 GB · 10 users — SAVE 20%
✓ Android app + configuration
✓ WhatsApp & email support
✓ Theme builder & ID card design
✓ Web stories, gallery, headlines
₹12,499 ₹9,999
20% OFF · SAVE ₹2,500 / YEAR

Full Press 15 GB · 30 users — SAVE 20%
✓ Android app + configuration
✓ WhatsApp & email support
✓ Theme builder & ID card design
✓ Web stories, gallery, headlines
₹16,249 ₹12,999
20% OFF · SAVE ₹3,250 / YEAR

ePAPER ONLY PDF to Interactive ePaper

Standard 5 GB · 5 users — SAVE 20%
✓ Automatic PDF extraction
✓ Custom domain & push alerts
✓ Unlimited pageviews & SEO
✓ Country & device-wise views
₹9,999 ₹7,999
20% OFF · SAVE ₹2,000 / YEAR

Expanded 10 GB · 10 users — SAVE 20%
✓ Android app & email support
✓ Drag & drop theme builder
✓ Employee ID card design
✓ Custom domain & push alerts
₹14,999 ₹11,999
20% OFF · SAVE ₹3,000 / YEAR

Full Press 15 GB · 30 users — SAVE 20%
✓ Android app + configuration
✓ WhatsApp & email support
✓ Theme builder & ID card design
✓ Custom domain & push alerts
₹19,999 ₹15,999
20% OFF · SAVE ₹4,000 / YEAR

NEWS + ePAPER the complete digital newspaper

Standard 5 GB · 5 users — SAVE 20%
✓ Automatic PDF extraction
✓ Custom domain & push alerts
✓ Web stories, gallery, headlines
✓ Country & device-wise views
₹17,499 ₹13,999
20% OFF · SAVE ₹3,500 / YEAR

Expanded 10 GB · 10 users — SAVE 20%
✓ Android app + configuration
✓ WhatsApp & email support
✓ Theme builder & ID card design
✓ Web stories, gallery, headlines
₹22,499 ₹17,999
20% OFF · SAVE ₹4,500 / YEAR

Full Press 15 GB · 30 users — BEST VALUE
✓ Android app + configuration
✓ WhatsApp & email support
✓ Theme builder & ID card design
✓ Web stories, gallery, headlines
₹32,499 ₹25,999
20% OFF · SAVE ₹4,500 / YEAR

PLATFORM HIGHLIGHTS
◆ Smart AI image extraction
◆ AdSense & sponsor ad slots
◆ Custom domain + auto SSL
◆ One-click publishing
◆ WhatsApp sharing
◆ AI tagging & SEO tags
◆ Real-time analytics
◆ AWS cloud - daily backups
◆ YouTube Video embedding

Try free for 12 days
No credit card required - Turn your print edition into a digital publication
CALL / WHATSAPP +91 7675087378
EMAIL hr@vangstechnologies.com
WEBSITE www.vangstechnologies.com
SCAN TO VISIT OUR WEBSITE
SCAN TO CALL +91 7675087378

కంగనా రనౌత్‌పై కేసు

ఈవార్తలు, వినోదవాణి: గాంధీ కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టులు పెట్టారన్న ఫిర్యాదుతో బీజేపీ ఎంపీ, నటి కంగనా రనౌత్‌పై హిమాచల్‌ప్రదేశ్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఆమె పోస్టులు ప్రజల్లో విద్వేషాలు రెచ్చగొట్టేలా ఉన్నాయని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉందని ఫిర్యాదుదారు ఆరోపించారు. రిటైర్డ్ కెప్టెన్ అతుల్ శర్మ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా నవంబర్ 13న షిమ్లాలో ఎఫ్ఐఆర్ నమోదైంది. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని సెక్షన్లు 196(1)(బి), 353(2), 356(2) కింద కేసు నమోదు చేసినట్లు సమాచారం. నవంబర్ 10న కంగనా తన ధ్రువీకరించిన సోషల్ మీడియా ఖాతాలో వరుస పోస్టులు పెట్టారని అతుల్ శర్మ ఫిర్యాదులో పేర్కొన్నారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ, ఆమె కుమారుడు సంజయ్ గాంధీ, మాజీ ప్రధాని రాజీవ్ గాంధీల మరణాలపై రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీని 'మిస్టీరియస్ ఫారిన్ నేషనల్'గా అభివర్ణించడంపైనా అభ్యంతరం వ్యక్తం చేశారు. గాంధీ కుటుంబంలో వరుస మరణాల తర్వాత సోనియా ప్రభుత్వ పగ్గాలు చేపట్టేలా పరిణామాలు జరిగాయన్న భావన కలిగించేలా పోస్టులు ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ పోస్టులకు 'హా కన్వీనియెంట్' అనే వ్యాఖ్యను జతచేశారని తెలిపారు.



వయ్యారి చిత్రం



బచ్చన్ ఇంట రుసరుస

ఈవార్తలు, వినోదవాణి: బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్ బచ్చన్ నివాసం 'జల్సా' బంగ్లా యాజమాన్య హక్కులపై బచ్చన్ కుటుంబంలో వివాదం మొదలైంది. అమితాబ్ తమ్ముడు అజితాబ్ బచ్చన్ భార్య రమోలా బచ్చన్.. 1993లో జల్సా బంగ్లాను జయా బచ్చన్ పేరిట బదిలీ చేస్తూ రూపొందించిన గిఫ్ట్ డీడ్‌ను సవాల్ చేశారు. తన ప్రమేయం, అనుమతి లేకుండానే ఆస్తి బదిలీ జరిగిందని ఆమె అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ముంబైలోని కపోల్ హౌసింగ్ సొసైటీ రికార్డుల్లో జల్సా యజమానిగా జయా బచ్చన్ పేరు ఉంది. అయితే మహారాష్ట్ర ప్రభుత్వ ప్రాపర్టీ కార్డులో మాత్రం రమోలా బచ్చన్ పేరే కొనసాగుతోంది. ప్రభుత్వ రికార్డుల్లో తన పేరు తొలగించి జయా బచ్చన్ పేరు చేర్చేందుకు ప్రయత్నాలు జరగడంతో ఈ వివాదం వెలుగులోకి వచ్చింది. జల్సా బంగ్లా తొలుత తన పేరిటే నమోదై ఉందని రమోలా చెబుతున్నారు. 1993లో రూపొందించిన గిఫ్ట్ డీడ్ సాధారణ కాగితంపై ఉందని, స్టాంప్ డ్యూటీ చెల్లించలేదని, సాక్షుల సంతకాలు కూడా లేవని ఆరోపించారు. మహారాష్ట్ర ప్రభుత్వ 'అభయ్ యోజన' కింద ఆ డీడ్‌ను క్రమబద్ధీకరించిన విధానంపైనా అభ్యంతరం వ్యక్తం చేశారు. గత ఏడు నెలలుగా రమోలా పలుమార్లు ఫిర్యాదులు చేయడంతో ఈ వ్యవహారం అంధేరిలోని కో-ఆపరేటివ్ సొసైటీస్ డిప్యూటీ రిజిస్ట్రార్ ఎదుట విచారణకు వచ్చింది. సంబంధిత పక్షాల నుంచి వివరణలు కోరిన అధికారులు విచారణ కొనసాగిస్తున్నారు. ఇప్పటివరకు ఎలాంటి తుది నిర్ణయం వెలువడలేదు. ఈ వివాదంపై అమితాబ్, జయా బచ్చన్ స్పందించలేదు. అభిషేక్ బచ్చన్ ప్రతినిధి మాత్రం ఇది కుటుంబ అంతర్గత వ్యవహారమని, దీనిపై వ్యాఖ్యానించబోమని తెలిపారు. ముంబై జుహులోని జల్సా బంగ్లా అమితాబ్ నివాసంగానే కాకుండా, ప్రతి ఆదివారం ఆయన అభిమానులను కలుసుకునే ప్రాంతంగానూ గుర్తింపు పొందింది.



నవ్వుల కాంబో జత!

ఎన్టీఆర్‌తో అనిల్ రావిపూడి సినిమా

ఈవార్తలు, వినోదవాణి: జూనియర్ ఎన్టీఆర్, దర్శకుడు అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో కొత్త సినిమా రానుంది. ఈ విషయాన్ని శనివారం ఇద్దరూ అధికారికంగా ప్రకటించారు. ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్‌పై నందమూరి కల్యాణ్ రామ్ ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. దర్శకుడు అనిల్ రావిపూడితో కలిసి దిగిన ఫొటోను ఎన్టీఆర్ ఎక్స్‌లో షేర్ చేశారు. 'ఈ సినిమా నవ్వుల జాతరలా ఉండబోతోంది' అంటూ చీ=ఞూఅఅశ్రీ=ఝుజఅజూబఒఅ హ్యాష్‌ట్యాగ్‌ను జత



చేశారు. తన సోదరుడు కల్యాణ్ రామ్‌తో పాటు ఎన్టీఆర్ ఆర్ట్స్‌ను కూడా ఈ పోస్టులో ట్యాగ్ చేశారు. ఎన్టీఆర్ సాధారణంగా మాస్, యాక్షన్ కథల్లో నటిస్తుండగా.. అనిల్ రావిపూడి కామెడీ ఎంటర్‌టైనర్లకు పేరుగాంచారు. వీరిద్దరి కలయికపై సినీ అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ఈ సినిమా పూర్తి స్థాయి కామెడీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం ఎన్టీఆర్.. దర్శకుడు ప్రశాంత్ నీల్‌తో 'డ్రాగన్' చిత్రంలో నటిస్తున్నారు. ఆ సినిమా పూర్తయిన తర్వాత అనిల్ రావిపూడి ప్రాజెక్ట్ ప్రారంభం కానున్నట్లు సమాచారం. మరోవైపు అనిల్ రావిపూడి ప్రస్తుతం వెంకటేశ్, కల్యాణ్ రామ్‌తో ఓ సినిమా తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రం 2027 సంక్రాంతికి విడుదల కానుంది. ఎన్టీఆర్, అనిల్ రావిపూడి సినిమాలోని ఇతర నటీనటులు, సాంకేతిక బృందం, షూటింగ్ వివరాలను చిత్రబృందం త్వరలో వెల్లడించనుంది.

'ఓం' ట్రైలర్‌లో సాయిపల్లవి పోరాటాలు

ఈవార్తలు, వినోదవాణి: ధనుశ్, సాయిపల్లవి, మమ్ముట్టి ప్రధాన పాత్రల్లో నటించిన బహుభాషా చిత్రం 'ఓం' ట్రైలర్ విడుదలైంది. ఆంధ్రప్రదేశ్ అడవుల్లో జరిగే ఎర్రచందనం స్మగ్లింగ్ నేపథ్యంలో రూపొందిన ఈ ట్రైలర్‌లో యాక్షన్ సన్నివేశాలు, ప్రధాన పాత్రలను పరిచయం చేశారు. ఈ సినిమా నవంబర్ 20న పలు భాషల్లో విడుదల కానుంది. ట్రైలర్‌లో ధనుశ్ అండర్‌కవర్ ఆఫీసర్‌గా కనిపించారు. తమిళనాడుకు చెందిన ఆర్గనైజ్డ్ క్రైమ్ ఇంటెలిజెన్స్ యూనిట్‌లో పనిచేసే ఆయన.. ఎర్రచందనం స్మగ్లింగ్ ముఠాలోకి చొరబడేందుకు కలప కూలీగా మారువేషం వేస్తారు. స్మగ్లింగ్ సిండికేట్ కార్యకలాపాలను బయటపెట్టేందుకు ఆయన చేసే ప్రయత్నాలు ఆసక్తి రేపుతున్నాయి. సాయిపల్లవి ఐపీఎస్ అధికారి నిత్యా రెడ్డి పాత్రలో కనిపించారు. ఆంధ్రప్రదేశ్ స్పెషల్ టాస్క్‌ఫోర్స్‌కు నాయకత్వం వహిస్తూ 'ఆపరేషన్ మోల్' పేరుతో స్మగ్లర్లపై చర్యలకు సిద్ధమవుతారు. ట్రైలర్‌లో ఆమె యాక్షన్ సన్నివేశాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ ఆపరేషన్ పేరుతోనే సినిమాకు 'ఓం' అనే టైటిల్ పెట్టినట్లు తెలుస్తోంది. మమ్ముట్టి స్మగ్లింగ్ నెట్‌వర్క్‌లో కీలక వ్యక్తిగా నటించగా, ధనుశ్ భార్య పాత్రలో శ్రీలీల కనిపించనున్నారు. ధనుశ్, సాయిపల్లవి కలిసి చేసే ఆపరేషన్‌తో పాటు ఛేజింగ్ సన్నివేశాలు ట్రైలర్‌లో ఆసక్తి పెంచాయి. రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి సాయి అభ్యంకర్ సంగీతం అందించారు. వాస్తవ సంఘటనల స్ఫూర్తితో సినిమాను రూపొందించినట్లు చిత్రబృందం తెలిపింది. తమిళంతో పాటు తెలుగు, మలయాళం, హిందీ, కన్నడ భాషల్లో నవంబర్ 20న విడుదల చేయనున్నారు.





కంగనా రనౌత్‌పై కేసు

ఈవార్తలు, వినోదవాణి: గాంధీ కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టులు పెట్టారన్న ఫిర్యాదుతో బీజేపీ ఎంపీ, నటి కంగనా రనౌత్‌పై హిమాచల్‌ప్రదేశ్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఆమె పోస్టులు ప్రజల్లో విద్వేషాలు రెచ్చగొట్టేలా ఉన్నాయని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉందని ఫిర్యాదుదారు ఆరోపించారు. రిటైర్డ్ కెప్టెన్ అతుల్ శర్మ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా నవంబర్ 13న షిమ్లాలో ఎఫ్ఐఆర్ నమోదైంది. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని సెక్షన్లు 196(1)(బి), 353(2), 356(2) కింద కేసు నమోదు చేసినట్లు సమాచారం. నవంబర్ 10న కంగనా తన ధ్రువీకరించిన సోషల్ మీడియా ఖాతాలో వరుస పోస్టులు పెట్టారని అతుల్ శర్మ ఫిర్యాదులో పేర్కొన్నారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ, ఆమె కుమారుడు సంజయ్ గాంధీ, మాజీ ప్రధాని రాజీవ్ గాంధీల మరణాలపై రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీని 'మిస్టీరియస్ ఫారిన్ నేషనల్'గా అభివర్ణించడంపైనా అభ్యంతరం వ్యక్తం చేశారు. గాంధీ కుటుంబంలో వరుస మరణాల తర్వాత సోనియా ప్రభుత్వ పగ్గాలు చేపట్టేలా పరిణామాలు జరిగాయన్న భావన కలిగించేలా పోస్టులు ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ పోస్టులకు 'హా కన్వీనియెంట్' అనే వ్యాఖ్యను జతచేశారని తెలిపారు.



3 నెలలు నిద్రలు పట్టలే

ఈవార్తలు, వినోదవాణి: బాలీవుడ్ నటి కియారా అద్వానీ తన తొలి ప్రెగ్నెన్సీ సమయంలో ఎదుర్కొన్న ఇబ్బందుల గురించి మాట్లాడారు. గర్భం దాల్చిన మొదటి మూడు నెలలు చాలా కష్టంగా గడిచాయని, వికారం, హార్మోన్ల మార్పులతో ఇబ్బందిపడ్డానని చెప్పారు. ఆ సమయంలో తల్లి, అత్తగారి మద్దతు తనకు ఎంతో అవసరమైందని గుర్తుచేసుకున్నారు. కరణ్ జోహార్ వ్యాఖ్యాతగా వ్యవహరించే 'కాఫీ విత్ కరణ్' షోలో కియారా ఈ విషయాలను వెల్లడించారు. "మొదటి మూడు నెలలు చాలా కఠినంగా గడిచాయి. వికారం, హార్మోన్ల మార్పులతో ఇబ్బందిపడ్డాను. మొదట్లో ఈ విషయం ఎవరికీ చెప్పకూడదని నేను, సిద్ధార్థ్ అనుకున్నాం. కానీ నాకు మహిళల మద్దతు అవసరమనిపించింది. వెంటనే సిద్ధార్థ్‌తో మాట్లాడి మా అమ్మ, అత్తగారితో మాట్లాడాలని చెప్పాను. నన్ను అర్థం చేసుకునే మహిళలు నా జీవితంలో ఉండాలని కోరుకున్నాను" అని తెలిపారు. ఆ సమయంలో స్నేహితురాళ్లతో కలిసి కూర్చుని ఏడ్చేదానినని, వారు తనను ఓదార్చేవారని కియారా చెప్పారు. మహిళల మధ్య ఉండే అనుబంధం, ఒకరినొకరు అర్థం చేసుకునే గుణం తనకు ధైర్యాన్నిచ్చాయని వివరించారు.

సీనియర్ నటుడు గిరిబాబు కన్నుమూత





ఈవార్తలు, వినోదవాణి: తెలుగు చిత్ర పరిశ్రమలో విషాదం చోటుచేసుకుంది. సీనియర్ నటుడు గిరిబాబు (80) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్ కొండాపూర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయన మృతితో టాలీవుడ్‌లో విషాదం అలముకుంది. గిరిబాబు అసలు పేరు యర్రా శేషగిరిరావు. 1946 జూన్ 8న ఉమ్మడి ప్రకాశం జిల్లా రావినూతలలో జన్మించారు. చిన్నతనం నుంచే నాటకాలపై ఆసక్తి ఉన్న ఆయన సినిమాల్లోకి వచ్చారు. 1973లో విడుదలైన 'జగమే మాయ' చిత్రంతో నటుడిగా పరిచయమయ్యారు. తొలినాళ్లలో హీరోగా నటించిన ఆయన ఆ తర్వాత విలన్‌గా, హాస్య నటుడిగా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా గుర్తింపు పొందారు. నాలుగు దశాబ్దాలకు పైగా సాగిన సినీ ప్రయాణంలో 600కు పైగా చిత్రాల్లో నటించారు. ఎన్టీఆర్, ఏఎన్నార్, కృష్ణ, మోహన్ బాబు వంటి అగ్ర నటులతో కలిసి పనిచేశారు. 1977లో వచ్చిన 'కురుక్షేత్రం' సినిమాలో దుశ్శాసనుడి పాత్రతో ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు. 'జ్యోతి', 'మెరుపు దాడి', 'పసివాడి ప్రాణం', 'బాలగోపాలుడు', 'హలో బ్రదర్', 'సిసింద్రి', 'లిటిల్ సోల్జర్స్', 'నిన్నే పెళ్లాడతా', 'చంద్రలేఖ', 'నువ్వే కావాలి' వంటి సినిమాల్లో విభిన్న పాత్రలు పోషించారు. తర్వాతి తరం హీరోల సినిమాల్లోనూ నటించారు. మహేశ్ బాబు 'అతడు' చిత్రంలో హీరోయిన్ తండ్రిగా కనిపించారు. 'గమ్యం', 'అ ఆ', 'గీత గోవిందం', 'డిస్కో రాజా', 'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్', 'జాతిరత్నాలు' వంటి సినిమాల్లోనూ నటించారు. నటుడిగానే కాకుండా దర్శకుడిగా, నిర్మాతగానూ గిరిబాబు పనిచేశారు. 'రణరంగం' (1985), 'ఇంద్రజిత్' (1990), 'నీ సుఖమే నే కోరుతున్నా' (2008) చిత్రాలకు దర్శకత్వం వహించారు. 'మెరుపు దాడి', 'దేవతలారా దీవించండి' వంటి సినిమాలను నిర్మించారు. గిరిబాబుకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు రఘుబాబు ప్రముఖ హాస్యనటుడిగా కొనసాగుతున్నారు. చిన్న కుమారుడు బోసుబాబు గతంలో ఓ సినిమాలో నటించారు. ఆయన భార్య శ్రీదేవి 2018లో కన్నుమూశారు. గిరిబాబు మృతిపట్ల సినీ ప్రముఖులు, అభిమానులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు.



15 బంతుల్లోనే
హాఫ్ సెంచరీ

హైదరాబాద్‌పై సూర్యకుమార్ విధ్వంసం

ఈవార్తలు, క్రీడావాణి: భారత టీ20 మాజీ కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ దేశవాళీ క్రికెట్‌లో అదరగొట్టాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ 2026లో హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో ముంబై కెప్టెన్‌గా బరిలోకి దిగిన అతడు.. 15 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. సూర్య ధాటికి 173 పరుగుల లక్ష్యాన్ని ముంబై మూడు వికెట్లు కోల్పోయి, ఆరు ఓవర్లకు పైగా మిగిలి ఉండగానే ఛేదించింది. కోల్‌కతాలోని జాదవ్‌పూర్ యూనివర్సిటీ గ్రౌండ్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన సూర్యకుమార్ చెలరేగాడు. 21 బంతుల్లో ఐదు సిక్సర్లు, ఆరు ఫోర్లతో 60 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ఈ ఏడాది మేలో ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ తరఫున ఆడిన తర్వాత అతడికి ఇదే తొలి ప్రొఫెషనల్ మ్యాచ్. టీ20 ప్రపంచకప్‌కు ముందు భారత జట్టు కెప్టెన్సీ బాధ్యతల నుంచి సూర్యకుమార్‌ను తప్పించిన నేపథ్యంలో.. దేశవాళీ క్రికెట్‌లో అతడి ఆటతీరుపై ఆసక్తి నెలకొంది. 36 ఏళ్ల వయసులో తిరిగి బరిలోకి దిగిన సూర్య.. తొలి మ్యాచ్‌లోనే తన బ్యాటింగ్ సత్తా చాటాడు. ముంబై కెప్టెన్‌గా జట్టును విజయపథంలో నడిపించాడు.

15 ఏళ్లకే కెప్టెన్.. వైభవ్
ప్రపంచ రికార్డు

ఈవార్తలు, క్రీడావాణి: భారత యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ మరో అరుదైన రికార్డు సృష్టించాడు. పురుషుల టీ20 క్రికెట్‌లో ఓ జట్టుకు కెప్టెన్సీ వహించిన అతి పిన్న వయస్కుడిగా నిలిచాడు. శనివారం ఇండోర్‌లోని హోల్కర్ స్టేడియంలో సౌరాష్ట్రతో జరిగిన 2026-27 సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ తొలి మ్యాచ్‌లో బీహార్ జట్టుకు నాయకత్వం వహించాడు. ఆ సమయానికి అతడి వయసు 15 ఏళ్ల 232 రోజులు. ఇప్పటివరకు ఈ రికార్డు క్రొయేషియా ఆటగాడు జాక్ వుకుసిచ్ పేరిట ఉండేది. అతడు 17 ఏళ్ల 311 రోజుల వయసులో తన జాతీయ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించాడు. ఇప్పుడు వైభవ్ ఆ రికార్డును అధిగమించాడు.





పాక్ పని పట్టారు..
కప్పు చేబట్టారు!

అండర్ 19 ఫైనల్‌లో పాక్‌పై భారత్ థ్రిల్లింగ్ విక్టరీ

చివరి బంతికి ఫోర్ కొట్టి గెలిపించిన మోహిత్ ఉల్వా

ఫైనల్‌లో పాకిస్థాన్‌ను చిత్తు చేసి, ఏసీసీ అండర్ 19 ఆసియాకప్ విజేతగా భారత్ నిలిచింది. చివరి బంతి వరకు ఉత్కంఠ భరితంగా సాగిన మ్యాచులో.. టీమిండియా థ్రిల్లింగ్ విక్టరీ సాధించింది. ఒమన్‌లోన్ అల్ అమెరత్ వేదికగా జరిగిన ఫైనల్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్.. 337 పరుగులు చేసింది.

అనంతరం బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా.. సమష్టి ప్రదర్శనతో అదరగొట్టింది. సరిగ్గా 50 ఓవర్లలో ఆ లక్ష్యాన్ని ఛేదించింది. దాయాదిపై థ్రిల్లింగ్ విక్టరీ సాధించి.. భారత క్రికెట్ అభిమానుల్లో సంతోషాన్ని నిలిపింది. 9వ సారి సగర్వంగా అండర్ 19 ఆసియాకప్ టైటిల్ ముద్దాడింది. ఈ మ్యాచులో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ అండర్ 19 జట్టు.. భారీ స్కోరు చేసింది.

ఓపెనర్ ఉస్మాన్ ఖాన్.. 111 బంతుల్లో 107 రన్స్ చేసి సత్తాచాటాడు. అబ్దుల్ ఖాదిర్ 54 బంతుల్లో 80 రన్స్ చేశాడు. కెప్టెన్ ఫర్హాన్ యూసుఫ్ 60 బంతుల్లో 63 పరుగులు చేయడంతో పాకిస్థాన్ నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 337 పరుగులు చేసింది. భారత బౌలర్లలో కావ్య పటేల్ అత్యధికంగా వికెట్లు తీశాడు. చిగురుపాటి వెంకట 3 వికెట్లు తీయగా, అర్జున్ రాజ్‌పుత్ ఒక వికెట్ పడగొట్టాడు. అనంతరం ఛేజింగ్ ప్రారంభించిన భారత్.. ఆచీతూచి బ్యాటింగ్ చేసింది. ఓపెనర్లు తొలి వికెట్‌కు 106 బంతుల్లో 95 రన్స్ జోడించారు. సాధించాల్సిన రన్ రేట్ పెరుగుతున్నా.. భారత బ్యాటర్లు మాత్రం మ్యాచ్‌ను చివరివరకూ తీసుకెళ్లాలని పట్టుదలతో ఆడారు. అయితే కీలక సమయంలో టీమిండియా వరుసగా వికెట్లు కోల్పోయింది. లక్ష్య రాజేష్ 101 బంతుల్లో 80 రన్స్ ఔట్ అయ్యాడు. ఆర్యవీర్ సెహ్వాగ్ 61 బంతుల్లో 58 పరుగులు చేసి పెవిలియన్ చేరాడు. టాప్ ఆర్డర్ బ్యాటర్లంతా త్వరగానే పెవిలియన్ చేరడంతో పాక్ శిబిరం విజయంపై ధీమా పెంచుకుంది. ఓ దశలో భారత్ 252 పరుగులకు 8 వికెట్లు కోల్పోయి ఓటమి అంచున నిలిచింది. సరిగ్గా ఇలాంటి సమయంలోనే మనాల్ చౌహాన్, మోహిత్ ఉల్వా అద్భుతం చేశారు. అసలే ఫైనల్ మ్యాచ్, అది కూడా పాకిస్థాన్‌తో.. ఇలాంటి పరిస్థితుల్లో వీరిద్దరూ తమలోని అసలైన ఆటను బయటపెట్టారు. మనాల్ చౌహన్ 32 బంతుల్లో 47 రన్స్ చేసి.. పాక్ శిబిరంలో భయం పుట్టించాడు. మరోవైపు మోహిత్ ఉల్వా సైతం ఎదురుదాడికి దిగాడు. వీరిద్దరూ 9వ వికెట్‌కు 35 బంతుల్లో 57 రన్స్ జోడించారు. అయితే విజయానికి 17 బంతుల్లో 29 పరుగులు అవసరమైన సమయంలో మనల్ చౌహాన్ ఔట్ అయ్యాడు. దీంతో మ్యాచ్ మరింత ఉత్కంఠగా మారింది. చివరి రెండు ఓవర్లలో భారత్ విజయానికి 19 పరుగులు అవసరమైన దశలో మోహిత్ ఉల్వా అద్భుతం చేశాడు. 49 ఓవర్లో ఏకంగా 17 రన్స్ రాబట్టాడు. చివరి బంతికి మూడు రన్స్ అవసరమైన సమయంలో మోహిత్ ఉల్వా ఫోర్ కొట్టి జట్టును విజయతీరాలకు చేర్చాడు. దీంతో టీమిండియా ఆటగాళ్లు గెలుపు సంబురాల్లో మునిగిపోయాడు. 10వ స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన మోహిత్ ఉల్వా.. 26 బంతుల్లో 49 రన్స్ చేసి.. తన కెరీర్‌లో మరిచిపోలేని ఇన్నింగ్స్ ఆడాడు. హీరోగా మారిపోయాడు.



గుజరాత్‌కు హర్షల్

ఈవార్తలు, క్రీడావాణి: ఐపీఎల్ రిటెన్షన్ గడువుకు ముందు కీలక ట్రేడ్ జరిగింది. సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) నుంచి సీనియర్ పేసర్ హర్షల్ పటేల్ గుజరాత్ టైటాన్స్ (జీటీ)కు మారుతున్నాడు. పూర్తి నగదు చెల్లింపు (ఆల్ క్యాష్ ట్రేడ్) ఒప్పందంలో భాగంగా గుజరాత్ రూ.4 కోట్లు చెల్లించనున్నట్లు తెలుస్తోంది. 2025 మెగా వేలంలో సన్‌రైజర్స్ హర్షల్‌ను రూ.8 కోట్లకు కొనుగోలు చేసింది. ఇప్పుడు అందులో సగం ధరకే గుజరాత్ అతడిని దక్కించుకున్నట్లు సమాచారం. 35 ఏళ్ల హర్షల్‌కు ఐపీఎల్‌లో ఇది ఐదో జట్టు. గతంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, ఢిల్లీ క్యాపిటల్స్, పంజాబ్ కింగ్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫున ఆడాడు. అహ్మదాబాద్‌లో జన్మించిన హర్షల్‌కు గుజరాత్‌తో ప్రత్యేక అనుబంధం ఉంది. దేశవాళీ క్రికెట్‌లోనూ అతడు గుజరాత్ జట్టుకే ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. 2024, 2025 వేలాల్లో అతడిని కొనుగోలు చేసేందుకు గుజరాత్ ప్రయత్నించినా సాధ్యం కాలేదు. ఇప్పుడు ట్రేడ్ ద్వారా ఆ జట్టులోకి చేరనున్నాడు. 2025 సీజన్‌లో సన్‌రైజర్స్ తరఫున 16 వికెట్లు తీసిన హర్షల్.. 2026లో మాత్రం ఐదు మ్యాచ్‌లే ఆడి ఒక్క వికెట్ కూడా పడగొట్టలేకపోయాడు. దీంతో అతడికి అవకాశాలు తగ్గాయి. ప్రస్తుతం గుజరాత్ జట్టులో కగిసో రబడా, మహమ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, జేసన్ హోల్డర్ వంటి పేసర్లు ఉన్నారు. వీరితో హర్షల్ కూడా జతకానున్నాడు.



గోల్‌కీపర్‌పై 12 మ్యాచ్‌ల నిషేధం

ఈవార్తలు, క్రీడావాణి: ఫుట్‌బాల్ మైదానంలో జరిగిన ఘర్షణలో ప్రత్యర్థి ఆటగాడు మృతి చెందిన ఘటనపై స్పెయిన్ ఫుట్‌బాల్ సమాఖ్య చర్యలు తీసుకుంది. ఎఫ్‌సీ అండోరా గోల్‌కీపర్ జీసస్ ఓవోనోపై 12 మ్యాచ్‌ల నిషేధం విధించింది. అతడితో ఢీకొన్న ఘటనలో టెనెరిఫే ఫార్వర్డ్ జీసస్ డి మిగ్వెల్ తీవ్రంగా గాయపడి మరణించాడు. నవంబర్ 2న స్పెయిన్ రెండో డివిజన్ లీగ్‌లో అండోరా, టెనెరిఫే జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. ఆట చివరి దశలో డి మిగ్వెల్‌ను ఓవోనో బలంగా ఢీకొట్టాడు. దీంతో రిఫరీ ఓవోనోకు రెడ్‌కార్డు చూపించాడు. మరుసటి రోజు 30 ఏళ్ల డి మిగ్వెల్ మరణించాడు. రిఫరీ నివేదికను పరిశీలించిన క్రమశిక్షణ కమిటీ.. ప్రత్యర్థి ఛాతీపై కాలితో అతిగా బల ప్రయోగం చేసినందుకే ఓవోనోకు రెడ్‌కార్డు ఇచ్చినట్లు పేర్కొంది. ఘటన తీవ్రత, దాని విషాదకర పరిణామాలను దృష్టిలో ఉంచుకుని గరిష్ఠంగా 12 మ్యాచ్‌ల నిషేధం విధించినట్లు తెలిపింది. ఈ ఘటనతో మధ్యలోనే నిలిచిపోయిన మ్యాచ్‌ను తిరిగి నిర్వహించకూడదని కూడా సమాఖ్య నిర్ణయించింది. ఆట ఆగిపోయే సమయానికి ఇరు జట్లు 2-2తో సమంగా ఉన్నాయి. అదే స్కోరును తుది ఫలితంగా ఖరారు చేసింది. ఈ ఘటన తర్వాతి రోజులు తన జీవితంలో అత్యంత కఠినమైనవని, డి మిగ్వెల్ మరణం తనను తీవ్రంగా కలచివేసిందని ఓవోనో తెలిపాడు. ప్రస్తుతం అతడు కుటుంబ సభ్యులతో ఉంటున్నట్లు అండోరా కోచ్ కార్లెస్ మాన్సో వెల్లడించాడు. తిరిగి ఆటలోకి రావాలా? ఎప్పుడు రావాలా? అన్నది ఓవోనోనే నిర్ణయించుకుంటాడని, క్లబ్ నుంచి ఎలాంటి ఒత్తిడి ఉండదని స్పష్టం చేశాడు.

టీ20 కాదు.. 'టెస్ట్ 20

క్రికెట్‌లో కొత్త ఫార్మాట్

ఈవార్తలు, క్రీడావాణి: టెస్ట్, వన్డే, టీ20ల తర్వాత క్రికెట్‌లో మరో కొత్త ఫార్మాట్ పరిచయమైంది. 'టెస్ట్ 20' పేరుతో రూపొందించిన ఈ ఫార్మాట్‌ను శ్రీలంక రాజధాని కొలంబోలో అధికారికంగా ఆవిష్కరించారు. టెస్ట్ క్రికెట్‌లోని వ్యూహాలను, టీ20 ఆటలోని వేగాన్ని కలిపి ఈ విధానాన్ని రూపొందించారు. 13 నుంచి 21 ఏళ్ల వయసున్న యువ క్రికెటర్లకు అవకాశం కల్పించడమే దీని లక్ష్యం. ఈ ఫార్మాట్‌లో 'పారిటీ రూల్' ప్రత్యేక ఆకర్షణ. ప్రతి ఫ్రాంచైజీ తరఫున బాలుర జట్టు, బాలికల జట్టు విడివిడిగా మ్యాచ్‌లు ఆడతాయి. బాలురు బాలురతో, బాలికలు బాలికలతో తలపడతారు. అయితే రెండు జట్ల స్కోర్లను కలిపి ఒకే స్కోర్‌బోర్డులో నమోదు చేస్తారు. ఈ ఉమ్మడి స్కోరు ఆధారంగానే మ్యాచ్ ఫలితాన్ని, పాయింట్ల పట్టికలో స్థానాలను నిర్ణయిస్తారు. రెండు జట్ల సమష్టి ప్రదర్శనతోనే ఫ్రాంచైజీ విజయం సాధించాల్సి ఉంటుంది. మొత్తం 80 ఓవర్ల ఆట నాలుగు ఇన్నింగ్స్‌లుగా సాగుతుంది. ఒక్కో జట్టు రెండేసి ఇన్నింగ్స్‌లు ఆడుతుంది. ప్రతి ఇన్నింగ్స్ 20 ఓవర్ల పాటు ఉంటుంది. మ్యాచ్ ఒకే రోజులో ముగుస్తుంది. టెస్ట్ క్రికెట్ తరహాలో మొదటి ఇన్నింగ్స్ స్కోరును రెండో ఇన్నింగ్స్‌కు కొనసాగిస్తారు. ఫాలోఆన్, టై, డ్రా వంటి సమీకరణాలు కూడా ఇందులో ఉంటాయి. కొలంబోలో జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ మాథ్యూ హేడెన్, శ్రీలంక మాజీ ఆటగాడు రస్సెల్ ఆర్నాల్డ్, కోచ్ రాజ్‌కుమార్ శర్మ తదితరులు హాజరయ్యారు. నవంబర్ 14 నుంచి 29 వరకు తొలి సీజన్ పోటీలు జరగనున్నాయి.

ఈవార్తలు
ప్రజావాణి
ఆదివారం 15-11-2026, జగిత్యాల
www.evarthalu.com
నేటి ఈవార్తలు

నేటి ఈవార్తలు **సంపాదకీయం** Editorial

మనుగడకు మోగిన గంట

ప్రకృతి మనిషికి ఎన్నో హెచ్చరికలు ఇస్తోంది. ఎక్కడో కరువు, మరెక్కడో వరదలు. ఒక ప్రాంతంలో భరించలేని వేడి, ఇంకో ప్రాంతంలో చలితో పాటు మంచు తుఫాన్లు. అడవుల్లో కార్చిచ్చు, పర్వత ప్రాంతాల్లో కొండచరియలు, తీర ప్రాంతాల్లో తీవ్ర తుపాన్లు. ఒకప్పుడు అరుదుగా కనిపించిన వాతావరణ విపత్తులు ఇప్పుడు తరచూ వార్తల్లో నిలుస్తున్నాయి. ఇవి విడివిడిగా జరిగే ప్రకృతి సంఘటనలేనా? లేక భూమి వాతావరణ వ్యవస్థలో వస్తున్న మార్పులకు సంకేతాలా? అన్న ప్రశ్నకు శాస్త్రవేత్తలు ఇప్పటికే స్పష్టమైన హెచ్చరికలు ఇస్తున్నారు. ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంఓ) నవంబర్ 9న విడుదల చేసిన 2026 వాతావరణ స్థితిగతుల నివేదిక ప్రకారం, ఈ ఏడాది ప్రపంచంలో నమోదైన అత్యంత వేడైన నాలుగు సంవత్సరాల్లో ఒకటిగా నిలిచే అవకాశం ఉంది. 2026 జనవరి నుంచి సెప్టెంబర్ వరకు ప్రపంచ సగటు ఉపరితల ఉష్ణోగ్రత పారిశ్రామిక విప్లవానికి ముందు 1850--1900 కాలంతో పోలిస్తే 1.47 డిగ్రీల సెల్సియస్ ఎక్కువగా నమోదైంది. 2015 నుంచి 2026 వరకు వరుసగా గత 12 సంవత్సరాలు అత్యంత వేడైన సంవత్సరాలుగా నిలిచే అవకాశం ఉందని సంస్థ పేర్కొంది. సముద్ర మట్టం ఉపగ్రహ పరిశీలనల ప్రారంభం నుంచి అత్యధిక స్థాయికి చేరగా, సముద్రాల్లో వేడి నిల్వలు వరుసగా పదో ఏడాది రికార్డు స్థాయిలో ఉండే సూచనలు కనిపిస్తున్నాయని తెలిపింది. ఈ పరిణామాల్లో ఎల్‌నినో ప్రభావం కూడా కీలకం. పసిఫిక్ మహాసముద్రంలోని సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలకు సంబంధించిన ఈ వాతావరణ పరిస్థితి ప్రపంచ ఉష్ణోగ్రతలపై ప్రభావం చూపుతుంది. డబ్ల్యూఎంఓ అంచనా ప్రకారం, 2026 డిసెంబర్ నాటికి ఎల్‌నినో తీవ్ర స్థాయికి చేరే అవకాశం ఉంది. దాని ప్రభావం 2027లోనూ కొనసాగుతూ తీవ్రమైన వేడి, కరువు, అధిక వర్షపాతం వంటి ప్రమాదాలను పెంచవచ్చు. అయితే ఈ నివేదికలో సెప్టెంబర్ వరకు అందుబాటులో ఉన్న సమాచారమే ప్రధానంగా ఉంది. ఎల్‌నినో తాజా ప్రభావాలన్నీ ఇందులో ప్రతిబింబించలేదని డబ్ల్యూఎంఓ స్పష్టం చేసింది. అంటే రానున్న పరిణామాలపై ఇంకా నిరంతర పరిశీలన అవసరం. ఈ ఏడాది ప్రపంచంలోని అనేక ప్రాంతాలు ఎదుర్కొన్న విపత్తులను గార్డియన్ నవంబర్ 14 కథనం వివరించింది. ఆస్ట్రేలియాలో తీవ్రమైన వేడితో అడవుల్లో మంటలు చెలరేగాయి. బ్రెజిల్‌లో భారీ వర్షాలు కొండచరియలు విరిగిపడటానికి కారణమయ్యాయి. ఆఫ్రికాలోని పలు దేశాల్లో వరదలు, మట్టిచరియలు ప్రాణనష్టాన్ని కలిగించాయి. దక్షిణాసియాలోనూ 45 డిగ్రీలకు మించిన ఉష్ణోగ్రతలు నమోదైన ప్రాంతాలున్నాయి. యూరప్‌లో తీవ్రమైన వేడి కారణంగా మరణాలు సంభవించగా, కరువు కారణంగా కొన్ని ప్రాంతాల్లో నీటి లభ్యత తగ్గింది. ఇవన్నీ ఒకే కారణంతో సంభవించాయని చెప్పలేం. కానీ వాతావరణ మార్పులు తీవ్ర ఘటనల ప్రమాదాన్ని పెంచుతున్నాయన్న శాస్త్రీయ అంచనాలకు ఇవి ఉదాహరణలుగా నిలుస్తున్నాయి.

ప్రజాసేవకుడిపై బురద రాజకీయం

కేసీఆర్ గారి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సాగిన ఉద్యమంలో ఆయనకు వెన్నంటి నడిచిన నాయకుడిగా, ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వంలో కీలక బాధ్యతలు నిర్వహించిన వ్యక్తిగా, నేడు ప్రతిపక్షంలో ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్న నాయకుడిగా హరీశ్ రావు గారి రాజకీయ ప్రస్థానం కొనసాగుతోంది. ఆయన కేవలం ఒక రాజకీయ నాయకుడు మాత్రమే కాదు. ఉద్యమ కాలం నుంచి నేటి వరకు పార్టీ కోసం, ప్రజల కోసం నిరంతరం పనిచేస్తూ, సిద్దిపేటతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలతో మమేకమై, వారి సమస్యలను తెలుసుకుంటూ, ప్రజలకు అందుబాటులో ఉంటున్న ప్రజాప్రతినిధి. అలాంటి నాయకుడిపై రాజకీయ ఆరోపణలు చేసి, దశాబ్దాల ప్రజా సేవను చెరిపేయాలని ప్రయత్నించడం ఎంతవరకు సమంజసం?



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలతో, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డైరెక్షన్‌లో సాగుతున్న రాజకీయ వ్యూహంలో భాగంగానే కవిత హరీశ్ రావు గారిని లక్ష్యంగా చేసుకుని మాట్లాడుతున్నారనేది మా అభిప్రాయం. ఒకవైపు కాంగ్రెస్, మరోవైపు బీజేపీ రాజకీయ ప్రయోజనాల కోసం హరీశ్ రావు గారి ప్రతిష్ఠను దెబ్బతీయాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయనే అనుమానాలు రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. ఈ పరిణామాల వెనుక ఉన్న రాజకీయ ఉద్దేశాలు ఏమిటన్నది ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది. తెలంగాణ ఉద్యమం అనగానే కేసీఆర్ గారి పోరాట పటిమ గుర్తుకు వస్తుంది. అదే సమయంలో ఆ ఉద్యమంలో హరీశ్ రావు పోషించిన పాత్రను కూడా మరువలేం. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కేసీఆర్ గారి పాత్ర ఎంత కీలకమో, హరీశ్ రావు గారి పాత్ర కూడా అంతే కీలకం. ఉద్యమ సమయంలో ప్రజలను సమీకరించడం, పార్టీని బలోపేతం చేయడం, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం నిరంతరం క్షేత్రస్థాయిలో పనిచేయడం వంటి ఎన్నో బాధ్యతలను ఆయన నిర్వహించారు. కేసీఆర్ గారికి అండగా నిలుస్తూ, ఉద్యమంలో వెన్నంటి నడిచిన నాయకుల్లో హరీశ్ రావు ముఖ్యులు.

ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత సాగునీటి శాఖ మంత్రిగా, ఆర్థిక శాఖ మంత్రిగా, అనంతరం వైద్యారోగ్య శాఖ బాధ్యతలు కూడా నిర్వహించిన హరీశ్ రావు ఆయా రంగాల్లో తనదైన ముద్ర వేశారు. సాగునీటి రంగంలో కాళేశ్వరం సహా పలు ప్రాజెక్టుల పనులు, నీటి పంపిణీ, ప్రాజెక్టుల పురోగతి, రైతులకు సాగునీరు అందించే అంశాలపై అధికారులతో నిరంతరం సమీక్షలు నిర్వహిస్తూ, క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పనిచేశారు. ఆర్థిక శాఖ మంత్రిగా రాష్ట్ర ఆర్థిక వ్యవహారాలను నిర్వహించడంతో పాటు, వైద్యారోగ్య శాఖ బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలను మెరుగుపరచడం, వైద్య సేవల విస్తరణ, వైద్య కళాశాలల ఏర్పాటు, ప్రజారోగ్య వ్యవస్థను బలోపేతం చేయడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. గతంలో "నేను రాను బిడ్డో సర్కారు దవాఖానకు" అని బెంబేలెత్తిన ప్రజలే, ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలు మెరుగుపడటంతో "పోదాం పద బిడ్డా.. సర్కారు దవాఖానకు" అనే స్థాయిలో నమ్మకం పెంచుకున్నారనే అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమైంది. ఒక నాయకుడి ప్రజా ప్రస్థానాన్ని అంచనా వేయాలంటే ఆధారాలు లేని ఆరోపణలకే ప్రాధాన్యత ఇవ్వకూడదు. ప్రజల కోసం ఆయన చేసిన కృషి, అందించిన సేవలు, ప్రజల పట్ల ఆయనకున్న నిబద్ధత, ప్రజలతో పెంచుకున్న అనుబంధాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలి.

సిద్దిపేట అంటే హరీశ్ రావు.. హరీశ్ రావు అంటే సిద్దిపేట అనేంతగా ప్రజల గుండెల్లో స్థానం సంపాదించిన నాయకుడు! 2004 నుంచి 2023 వరకు జరిగిన ఏడు ఎన్నికల్లోనూ సిద్దిపేట ప్రజలు హరీశ్ రావు గారిని వరుసగా గెలిపించి అసెంబ్లీకి పంపించారు. ముఖ్యంగా 2018 అసెంబ్లీ ఎన్నికల్లో 1,18,699 ఓట్ల భారీ మెజారిటీతో విజయం సాధించారు. 2023 ఎన్నికల్లోనూ ఏదోసారి విజయం సాధించి ప్రజల్లో తనకున్న ఆదరణను మరోసారి చాటుకున్నారు. ఎన్నిక నుంచి ఎన్నికకు ప్రజలతో తన అనుబంధాన్ని మరింత బలోపేతం చేసుకుంటూ, నియోజకవర్గ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతున్నారు. సిద్దిపేట అభివృద్ధి విషయంలో ఆయన చేసిన కృషి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. కులమత, రాజకీయ భేదాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు అభివృద్ధి ఫలాలు అందేలా కృషి చేస్తూ, ప్రజల అవసరాలను గుర్తించి విద్య, వైద్యం, ఉపాధి, రహదారులు, తాగునీరు, పారిశుధ్యం, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చారు. అభివృద్ధి కార్యక్రమాలను కేవలం ప్రకటనలకే పరిమితం చేయకుండా క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజాప్రతినిధిగా గుర్తింపు తెచ్చుకున్నారు. సిద్దిపేటకు రాష్ట్ర స్థాయిలోనే కాకుండా జాతీయ స్థాయిలోనూ గుర్తింపు తీసుకురావడంలో ఆయన పాత్రను స్థానిక ప్రజలు ఇప్పటికీ గుర్తుచేసుకుంటున్నారు.

తలకిందులు తపస్సు చేసినా హరీష్‌ను ఓడించడం ఎవరి తరం కాదు అనే బలమైన ముద్ర ప్రజల్లో ఏర్పడింది. ఎందుకంటే సిద్దిపేట ప్రజలకు ఆయన ఒక రాజకీయ నాయకుడు మాత్రమే కాదు.. తమ సమస్యలను వినే వ్యక్తి, తమ అవసరాలకు స్పందించే నాయకుడు, తమ కుటుంబంలో ఒకరిగా భావించే వ్యక్తి. కవిత .. మీరు నిజంగా ప్రజల కోసం పనిచేసే నాయకురాలినని భావిస్తే, 2019లో నిజామాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు మిమ్మల్ని ఎందుకు ఓడించారు? ప్రజల్లో మీ పట్ల అదే స్థాయిలో అభిమానం, విశ్వాసం ఉంటే ఆ ఎన్నికల్లో ఓటమి ఎందుకు ఎదురైంది? ఒకసారి ఎన్నికల్లో ఓడిపోవడం రాజకీయ జీవితానికి ముగింపు కాదు. కానీ ప్రజల తీర్పును గౌరవించడం ప్రతి రాజకీయ నాయకుడి బాధ్యత. అదే సమయంలో సిద్దిపేట ప్రజలు హరీశ్ రావు గారిని ఏడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నుకోవడం వెనుక ఉన్న ప్రజాభిమానాన్ని కూడా అర్థం చేసుకోవాలి. హరీశ్ రావుపై కవిత విమర్శలు చేసే ముందు, గతంలో ఢిల్లీ మద్యం విధానానికి సంబంధించిన కేసులో ఎదుర్కొన్న పరిణామాలను కూడా గుర్తు చేసుకోవాలి. ఆ కేసులో అరెస్టై జైలులో గడిపిన అంశాన్ని రాజకీయ చర్చల్లో ప్రస్తావించేటప్పుడు న్యాయపరమైన పరిణామాలను కూడా గౌరవించాలి. 2026 ఫిబ్రవరి 27న ఢిల్లీ ట్రయల్ కోర్టు సీబీఐ దర్యాప్తుకు సంబంధించిన కేసులో కవిత గారితో పాటు మొత్తం 23 మంది నిందితులను డిశ్చార్జ్ చేసింది. అయితే ఈ ఉత్తర్వును సీబీఐ ఢిల్లీ హైకోర్టులో సవాలు చేసింది. ఆ సవాలుపై న్యాయ ప్రక్రియ కొనసాగుతోంది. ఈ పరిణామాల నేపథ్యంలో న్యాయపరమైన ప్రక్రియను గౌరవిస్తూ, ఒకరిపై ఒకరు వ్యక్తిగత ఆరోపణలు చేసుకోవడం కంటే ప్రజలకు ఉపయోగపడే అంశాలపై మాట్లాడటం అవసరం.

ఒకవైపు కాంగ్రెస్, మరోవైపు బీజేపీ, మరోవైపు కవిత చేస్తున్న విమర్శలు.. ఇవన్నీ రాజకీయ పరిణామాల్లో భాగంగా ప్రజలు గమనిస్తున్నారు. హరీశ్ రావు గారిపై చేస్తున్న ఆరోపణల్లో నిజానిజాలు తేల్చాల్సింది ఆధారాలు, విచారణలు, ప్రజాస్వామ్య వ్యవస్థలే తప్ప రాజకీయ ప్రకటనలు కాదు. ఒక నాయకుడి స్థాయిని అంచనా వేయడంలో ఆయన ప్రజల కోసం చేసిన పనులు, ఉద్యమంలో పోషించిన పాత్ర, ప్రజలతో సంపాదించుకున్న అనుబంధం కూడా ముఖ్యమైనవి. కవిత గారికి చెప్పదలుచుకున్నది ఒక్కటే.. హరీశ్ రావు గారిపై ఆరోపణలు చేయడం కంటే ప్రజలకు ఉపయోగపడే పనులు చేసి చూపించండి, ప్రజా సమస్యలపై పోరాడండి. రాజకీయ విమర్శలకు ప్రజలు ఎన్నికల సమయంలోనే కాదు, ప్రతి సందర్భంలోనూ తమ అభిప్రాయాన్ని తెలియజేస్తారు. ప్రజా నాయకుడైన హరీశ్ రావు గారి మీద మీరు ఎన్ని కుట్రలు పన్నినా, ఎన్ని విషప్రచారాలు చేసినా ప్రజల్లో ఆయనకున్న ఖ్యాతిని, ఆయన పట్ల ఉన్న నమ్మకాన్ని, ఆయన మీద ఉన్న అభిమానాన్ని తగ్గించలేరు. ఎందుకంటే ఆయన క్రమశిక్షణ కలిగిన, నిబద్ధత ఉన్న నాయకుడు. కేసీఆర్ గారి వెన్నంటే ఉంటూ, జనమే తన కుటుంబంగా, ప్రజా శ్రేయస్సే తన ధ్యేయంగా భావిస్తూ, ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ రాత్రింబవళ్లు తేడా లేకుండా నిబద్ధతతో పనిచేస్తున్న ప్రజా నాయకుడు హరీశ్ రావు . సిద్దిపేట ప్రజల నమ్మకాన్ని ఏడుసార్లు గెలుచుకున్న నాయకుడిపై చేసే విమర్శలను ప్రజలు ఎంతవరకు విశ్వసిస్తారో కాలమే సమాధానం చెబుతుంది.



నజీమ్ పటేల్
బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి



డిజిటల్ స్వావలంబన ఇంకా దూరమే!

ప్రపంచాన్ని వేగంగా మార్చుతున్న సాంకేతిక పరిజ్ఞానాల్లో కృత్రిమ మేధ ముందువరుసలో ఉంది. విద్య నుంచి వైద్యం వరకు, వ్యవసాయం నుంచి రక్షణ రంగం వరకు దాని ప్రభావం విస్తరిస్తోంది. భవిష్యత్తులో దేశాల ఆర్థిక, సైనిక, సాంకేతిక సామర్థ్యాలను నిర్ణయించే కీలక శక్తుల్లో ఇది ఒకటిగా మారుతోంది. ఈ రంగంలో కొద్ది దేశాలు, కొద్ది సంస్థల ఆధిపత్యం పెరుగుతున్న కొద్దీ మిగతా దేశాల ముందు కొత్త సవాళ్లు నిలుస్తున్నాయి. మన డేటా, మన భాషలు, మన ప్రభుత్వ వ్యవస్థలు, మన ప్రజల అవసరాలపై పనిచేసే కృత్రిమ మేధను ఇతర దేశాల సాంకేతిక వేదికలపై పూర్తిగా ఆధారపడి నిర్మించగలమా? అన్న ప్రశ్నకు భారత్ సమాధానం వెతుకుతోంది. దేశీయ కృత్రిమ మేధ సంస్థల ఎదుగుదల ఈ దిశలో ఆశలు రేకెత్తిస్తున్నా, సంపూర్ణ స్వావలంబన సాధించడానికి ఇంకా చాలా దూరం ప్రయాణించాల్సి ఉంది. భారతదేశం స్వదేశీ కృత్రిమ మేధ సామర్థ్యాన్ని పెంచుకోవడానికి బెంగళూరుకు చెందిన సర్వమ్ వంటి సంస్థలపై పెట్టుకుంటున్న ఆశలను వివరించింది. అమెరికా, చైనా సాంకేతిక పరిజ్ఞానంపై అధికంగా ఆధారపడకుండా భారత అవసరాలకు సరిపోయే నమూనాలను అభివృద్ధి చేయడమే ఈ ప్రయత్నాల లక్ష్యం. సర్వమ్ 105 బిలియన్ పారామీటర్ల సామర్థ్యమున్న నమూనాను రూపొందించగా, మరింత పెద్ద నమూనాను అభివృద్ధి చేసే ప్రయత్నంలో ఉన్నట్లు ఆ కథనం పేర్కొంది. భారతీయ భాషల్లో సంభాషణలు, సంస్థలకు అవసరమైన స్వర ఆధారిత సేవలు, బ్యాంకింగ్, బీమా వంటి రంగాల్లో వినియోగం ఈ సంస్థ ప్రధాన దృష్టిగా ఉన్నాయి. సర్వమ్ సంస్థ జూన్ 15న విడుదల చేసిన ప్రకటన ప్రకారం, 300 మిలియన్ డాలర్ల సిరీస్-బి పెట్టుబడి సమీకరణలో తొలి విడతగా 234 మిలియన్ డాలర్లు పొందింది. ఆ దశలో సంస్థ విలువ 1.5 బిలియన్ డాలర్లుగా అంచనా వేశారు. హెచ్‌సీఎల్‌టెక్, బెస్సెమర్ వెంచర్ పార్ట్‌నర్స్ ఈ పెట్టుబడిలో పాల్గొన్నాయి. భారతదేశంలోనే శిక్షణ పొందిన నమూనాలు, సంస్థల కోసం సొంత కృత్రిమ మేధ వ్యవస్థలు అభివృద్ధి చేయడం తమ లక్ష్యమని సర్వమ్ వెల్లడించింది. సంస్థ ప్రకటనల్లో పేర్కొన్న వినియోగ గణాంకాలు దాని సొంత వివరాలే అయినప్పటికీ, భారతీయ భాషల ఆధారంగా దేశీయంగా సాంకేతిక పరిజ్ఞానం నిర్మించాలన్న ప్రయత్నం ప్రాధాన్యమైనది. ఈ ప్రయాణానికి ప్రభుత్వ మద్దతు కూడా అవసరం. కేంద్రం 2024 మార్చి 7న రూ.10,371.92 కోట్ల వ్యయంతో ఐదేళ్ల కాలానికి ఇండియా ఏఐ మిషన్‌కు ఆమోదం తెలిపింది. కంప్యూటింగ్ సామర్థ్యాన్ని పెంచడం, దేశీయ నమూనాల అభివృద్ధి, నాణ్యమైన డేటా అందుబాటు, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి, బాధ్యతాయుతమైన వినియోగం వంటి అంశాలు ఈ మిషన్‌లో భాగంగా ఉన్నాయి. ప్రభుత్వ ప్రధాన శాస్త్రీయ సలహాదారు కార్యాలయం వివరాల ప్రకారం, ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంతో 38 వేలకుపైగా గ్రాఫిక్స్ ప్రాసెసింగ్ యూనిట్లను అందుబాటులోకి తీసుకురావడమూ ఈ ప్రయత్నంలో భాగమే. ఇవి పెద్ద కృత్రిమ మేధ నమూనాల శిక్షణకు అవసరమైన గణన సామర్థ్యాన్ని అందిస్తాయి. అయితే ఒక దేశంలో నమూనా రూపొందించినంత మాత్రాన అది సంపూర్ణ స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంగా మారదు. దానికి అవసరమైన అధునాతన చిప్‌లు ఎక్కడ తయారవుతున్నాయి? డేటా నిల్వకు ఉపయోగించే కేంద్రాలు ఎక్కడ ఉన్నాయి? విద్యుత్తు, నీటి అవసరాలు ఎలా తీరుస్తున్నారు? శిక్షణకు అవసరమైన సాఫ్ట్‌వేర్, మౌలిక సదుపాయాలపై ఎవరి నియంత్రణ ఉంది? నమూనా పనిచేయడానికి అవసరమైన కీలక భాగాలు విదేశీ సరఫరాదారుల నుంచి రావాల్సి వస్తే సరఫరా నిలిచిపోయినప్పుడు పరిస్థితి ఏమిటి? ఇవన్నీ స్వావలంబనలో భాగమే. సాంకేతిక పరిజ్ఞానం దేశంలో అభివృద్ధి చెందడం ఒక ముందడుగు. కానీ దాని ఉత్పత్తి, నిర్వహణ, భద్రత, విస్తరణకు అవసరమైన మొత్తం వ్యవస్థను దేశీయంగా నిర్మించుకోవడం మరో పెద్ద లక్ష్యం.

- అలేఖ్య కట్కం

రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9493541919

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9493541919. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.